




# విజయభాను






విశాఖపట్నం, శుక్రవారం 04-09-2020 | VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM | సంపుటి : 43 సంచిక : 309 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# రైతులకు అందే విద్యుత్ ఉచితమే

- అమల్లో ఉన్న పథకాన్ని మరింత మెరుగుపరుస్తున్నాం
- వ్యవసాయ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేస్తున్నాం
- విద్యుత్ నగదు బదిలీకి ఏపీ కేబినెట్ ఆమోదం



కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అమరావతి : రైతుకు అందే విద్యుత్తు ఎప్పటికీ ఉచితమేనని, ఒక్క కనెక్షన్ కూడా తొలగించబోమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణల వల్ల రైతుపై ఒక్కపైసా భారం కూడా పడదని హామీ ఇచ్చారు. అమల్లో ఉన్న పథకాన్ని మరింత మెరుగుపరుస్తున్నామని, వచ్చే 30-35ఏళ్లపాటు ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా చేస్తున్నట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ కేబినేట్ గురువారం సమావేశమైంది. సీఎం జగన్ అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో ఉచిత విద్యుత్ పథకం- నగదు బదిలీకి రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అన్ని వ్యవసాయ కనెక్షన్లను రెగ్యులరైజ్ చేస్తున్నట్లు తెలిపారు. "కనెక్షన్ ఉన్న రైతు పేరు మీద బ్యాంకు ఖాతా ఉంటుంది. కరెంటు బిల్లు డబ్బు అందులో నేరుగా జమ కానుంది. అదే డబ్బును రైతులు డిస్కంలకు చెల్లించనున్నారు. దీని వల్ల రైతుపై ఎలాంటి భారం ఉండదు" అని స్పష్టం చేశారు. "చంద్రబాబు ఉచిత విద్యుత్తు సాధ్యం కాదన్నారు. కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవడమేనని ఎద్దేవా చేశారు. బషీర్‌బాగ్‌లో రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర చంద్రబాబుది. సుమారు 8వేల కోట్ల మేర ఉచిత విద్యుత్తు బకాయిలు పెట్టారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ బకాయిలు తీర్చాం. రూ. 1700 కోట్లతో ఫీడర్లను అప్‌గ్రేడ్ చేశాం. నాణ్యమైన కరెంటు ఇస్తున్నాం. పగటిపూట 9 గంటల కరెంటు, ఇప్పటికే 89శాతం ఫీడర్లలో అమలు అవుతోంది. రబీ సీజన్ నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది. 10వేల మెగావాట్ల సోలార్‌తో పథకాన్ని మరింత గొప్పగా దీర్చిదిద్దుతాం. ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేకుండా ప్రణాళికలు రచిస్తున్నాం. ఉచిత విద్యుత్‌పై పేటెంట్ ఒక్క వైఎస్సార్‌కే ఉంది. అందుకే పథకానికి ఆయన పేరు"

తరువాయి 2లో..

## బ్యాంకర్లతో ఆర్థిక మంత్రి కీలక భేటీ

### సెప్టెంబర్ 15 నాటికి రుణ పునర్వ్యవస్థీకరణ సిద్ధం




న్యూఢిల్లీ : కోవిడ్-19తో ప్రభావితమైన వ్యాపార సంస్థలను కాపాడేందుకు సెప్టెంబర్ 15 నాటికి రుణ పునర్వ్యవస్థీకరణ ప్రణాళికను సిద్ధం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బ్యాంకులను కోరారు. ప్రభుత్వ రంగ బ్యాంకులతో గురువారం నిర్మలా సీతారామన్ సమావేశమయ్యారు. రుణాల పునర్వ్యవస్థీకరణకు బోర్డు ఆమోదించిన విధానాన్ని సత్వరమే అమలు చేసేందుకు బ్యాంకులు సిద్ధం కావాలని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకానికి అర్హులైన రుణగ్రహీతలను గుర్తించి సత్వరమే వారిని సంప్రదించి ఆయా వ్యాపారాలను బ్యాంకులు, ఆర్థిక సంస్థలు కాపాడాల్సిన అవసరం ఉందని అన్నారు. కోవిడ్-19తో దెబ్బతిన్న రంగాలకు రుణ పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక అమలుకు సన్నద్ధతను ఆయా బ్యాంకుల సీఈఓలతో సమీక్షించారు. రుణాల చెల్లింపులపై మారటోరియంను ఎత్తివేసే సమయంలో రుణగ్రహీతలకు బ్యాంకులు బాసటగా నిలవాలని సూచించారు. రుణగ్రహీతల

తరువాయి 2లో..

## ప్రధాని మోదీ పర్సనల్ వెబ్‌సైట్ హ్యాక్..



న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్ర మోదీకి చెందిన పర్సనల్ వెబ్‌సైట్ అకౌంట్ హ్యాక్ అయ్యింది. ఈ విషయాన్ని ట్విట్టర్ సంస్థ ధ్రువీకరించింది. జాతీయ రిలీఫ్ ఫండ్‌కు క్రిప్టోకరెన్సీ రూపంలో విరాళాలు ఇవ్వవచ్చు అని ఆ వెబ్‌సైట్ పేజీలో ట్వీట్లు కనిపించాయి. దీంతో ప్రధాని అకౌంట్ హ్యాక్ అయినట్లు ధ్రువీకరించారు. అయితే మోదీ అకౌంట్‌ను సెక్యూర్ చేసినట్లు కూడా ట్విట్టర్ సంస్థ వెల్లడించింది. ట్విట్టర్ సంస్థ ప్రతినిధి ఈ సంఘటనపై స్పందిస్తూ.. హ్యాకింగ్ గురించి తెలుసుకున్నామని, అకౌంట్‌ను మళ్లీ సెక్యూర్ చేశామని, ఈ సంఘటనను నిరంతరం దర్యాప్తు చేస్తున్నామని, అయితే ప్రధానికి చెందిన ఇతర అకౌంట్లపై ప్రభావం పడిందా అన్న విషయం తమకు తెలియదని అన్నారు. నరేంద్ర మోదీ (narendramodi_in) అకౌంట్‌పై పోస్టు చేసిన ట్వీట్లకు

తరువాయి 2లో..

## తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిగా అచ్చెన్న?



అమరావతి : పార్టీ శాసనసభాపక్ష ఉపనేత అచ్చెన్నాయుడిని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించే అవకాశం ఉన్నట్టు పార్టీవర్గాల్లో చర్చ జరుగుతోంది. పార్టీలోని సీనియర్లలో ఎక్కువ మంది అచ్చెన్ననే పార్టీ అధ్యక్షుడిగా నియమించాలన్న అభిప్రాయాన్ని అధినేత వద్ద వ్యక్తం చేసినట్టు తెలిసింది. పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియను తెదేపా ఇప్పటికే మండల స్థాయి వరకు దాదాపుగా పూర్తిచేసింది. ఇకపై లోక్‌సభ నియోజకవర్గాల వారీగా కమిటీలను నియమించనున్నారు. దీనిపై చంద్రబాబు ఇప్పటికే కసరత్తు దాదాపు పూర్తిచేశారు. వారం, పది రోజుల్లో పార్లమెంటరీ కమిటీలను ప్రకటిస్తారని, ఆ తర్వాత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కమిటీల నియామకం పూర్తిచేస్తారని పార్టీవర్గాలు తెలిపాయి.

## తితిదే నిధులపై కాగ్‌తో ఆడిట్ చేయించండి

### ప్రభుత్వాన్ని కోరిన ధర్మకర్తల మండలి



తిరుమల: నిధుల వినియోగంపై కాగ్‌తో ఆడిట్ చేయించాలని తితిదే ధర్మకర్తల మండలి ఏపీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు గత నెల 27 జరిగిన ధర్మకర్తల మండలి సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపింది. ఇకపై ప్రతిఏటా నిధుల వినియోగంపై కాగ్ ద్వారా ఆడిట్ చేసేలా తీర్మానం చేసింది. 2014-15 నుంచి 2019-20 మధ్య నిధుల వినియోగంపై రీ ఆడిట్ చేయాలని నిర్ణయించింది. గతంలో ఆడిట్ ప్రక్రియను అంతర్గతంగా నిర్వహించేవారు. ప్రభుత్వం అనుమతించిన తర్వాత కాగ్ ఆడిట్ ప్రక్రియ ప్రారంభించనుంది.

నిధుల వినియోగంపై పారదర్శకత తీసుకురావాలన్న

తరువాయి 2లో..

## మద్యం ధరలను సవరిస్తూ ఉత్తర్వులు

అమరావతి : మద్యం ప్రియులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీరు కబురును అందించింది. మద్యం ధరలను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఐఎంఎఫ్ లిక్కర్, ఫారెన్ లిక్కర్, బీర్, వైన్ ధరలను క్రమబద్ధీకరిస్తూ మార్పులు చేసింది. ఈ మేరకు గురువారం జరిగిన మంత్రివర్గ భేటీ అనంతరం ధరలను క్రమబద్ధీకరిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. రూ.150 కంటే తక్కువ ధర ఉన్న బ్రాండ్లపై తగ్గించింది. అలాగే 90ఎమ్‌ఎల్ రూ.190 నుంచి రూ.600 వరకు ఉన్న మద్యంపై ధరలను పెంచింది. బీర్లు, రెడీ టు డ్రింక్ ధరలు తగ్గిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

## 'నమస్తే'తో మనసులు గెలుచుకున్న రాజ్‌నాథ్



మాస్కో: ప్రస్తుతం కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో దేశ సంస్కృతిలో భాగమైన 'నమస్తే' పదం బాగా ప్రాచుర్యం పొందింది. కరోనా నుంచి తప్పించుకోవడానికి షేక్‌హ్యాండ్ బదులు చేతులతో నమస్కారం చేయడం శ్రేయస్కరమని పాశ్చాత్య దేశాలు గ్రహిస్తున్నాయి. కాగా ప్రస్తుతం భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రష్యాలో పర్యటిస్తున్నారు. రష్యాలో జరగనున్న షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ కీలక సమావేశంలో పాల్గొనేందుకు రక్షణ మంత్రి నిన్న రాత్రి మాస్కో చేరుకున్నారు. రష్యన్ సైనికాధికారుల్లో ఒకరు షేక్ హ్యాండ్ ఇవ్వబోగా సున్నితంగా తిరస్కరించిన రాజ్ నాథ్ 'నమస్తే' అంటూ చేతులు

తరువాయి 2లో..

## లేహ్‌కు ఆర్మీ చీఫ్.. సరిహద్దు భద్రతపై సమీక్ష



న్యూఢిల్లీ : ఆర్మీ చీఫ్ జనరల్ మనోజ్ ముకుంద్ నరవాణె ఇవాళ లేహ్ వెళ్తన్నారు. లడఖ్‌లోని లేహ్‌లో ఆయన సరిహద్దు భద్రతపై సమీక్ష నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు ఆయన పర్యటన కొనసాగనున్నది. సీనియర్ ఫీల్డ్ కమాండర్లు.. సరిహద్దు పరిస్థితిపై ఆయనకు వివరించనున్నారు. వాస్తవాధీన రేఖ వద్ద ఉన్న ఉద్రిక్తతల గురించి ఆర్మీ చీఫ్ తెలుసుకోనున్నారు. దళాలు ఎంత వరకు సమాయత్తంగా ఉన్నాయో ఆర్మీ చీఫ్‌కు విశ్లేషించనున్నారు. గత మూడు నెలలుగా వాస్తవాధీన రేఖ వెంట ఉద్రిక్తత నెలకొని ఉన్న విషయం తెలిసిందే. తాజాగా చైనా దళాలు మళ్లీ దుస్సాహసం చేశాయి. ఈ నేపథ్యంలో పాన్‌గాంగ్ సరస్సు వద్ద ఆందోళనకర పరిస్థితి నెలకొన్నది. చైనా దళాలను అడ్డుకునేందుకు భారతీయ ఆర్మీ నిరంతరం అప్రమత్తంగా ఉన్నట్లు రక్షణ శాఖ వర్గాలు వెల్లడించాయి.

## భారత్‌లో కరోనా కల్లోలం రికార్డుస్థాయి కేసులు

### రోజువారీ కేసుల్లో ప్రపంచంలోనే అత్యధికం

### దేశంలో 38 లక్షలు దాటిన కేసులు, 67వేల మరణాలు

దిల్లీ: భారత్‌లో కరోనా వైరస్ విజృంభణ రోజురోజుకీ పెరుగుతోంది. నిత్యం రికార్డు స్థాయిలో నమోదవుతున్న పాజిటివ్ కేసులు.. గత 24గంటల్లోనే అత్యధికంగా 11.70లక్షల శాంపిల్స్‌ను పరీక్షించగా 83,883 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. భారత్‌లో ఒకేరోజులో 80వేలకు పైగా కేసులు నమోదవడం ఇదే ప్రథమం. అంతేకాకుండా ప్రపంచంలో ఏ దేశంలోనూ ఒక్కరోజు వ్యవధిలో ఇన్ని కేసులు నమోదుకాలేదు. దీంతో

తరువాయి 2లో..

## ఆధునాతన పారిశుధ్య యంత్రాల ప్రారంభం



విజయవాడ : అధునాతన పారిశుధ్య యంత్రాలను మంత్రి బొత్స సత్యనారాయణతో కలిసి విజయవాడ మున్సిపల్ కమిషనర్ ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విఎంసీ తరుపున కొత్త టెక్నాలజీతో ఏడు కొత్త వాహనాలను కొనుగోలు చేశామని ప్రసన్న వెంకటేష్ తెలిపారు. వీటి ద్వారా కాలువల పూడికలను సులువుగా తీయొచ్చని పేర్కొన్నారు. జెసిబీలో మూడు మినీ వాహనాలు, కొత్తగా మూడు నాళామేన్ వాహనాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. మూడు క్లీనింగ్ యంత్రాలను సైతం అందుబాటులోకి తెస్తున్నామని వివరించారు. ఈ కొత్త యంత్రాల వల్ల పని వేగవంతమవుతుందని, సమయం కూడా ఆదా అవుతుందన్నారు.



## కేంద్ర పురస్కారాలకు 15లోగా నామినేషన్ చేయాలి

### -ఐసిడిఎస్ పథక సంచాలకులు డా.జి.జయదేవి



శ్రీకాకుళం : జిల్లాలోని వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బాల బాలికలు, సంస్థలు ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాల కొరకు ఈ నెల 15లోగా ఆన్‌లైన్ లో నామినేషన్ చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డా. జి.జయదేవి పేర్కొన్నారు. ఈ మేరకు గురు వారం ఒక ప్రకటన విడుదల చేసారు. సాంస్కృతిక, కళలు, క్రీడలు, సమాజసేవ, పాండిత్యం, సాహస రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన బాలలు, బాలల రక్షణ, అభివృద్ధి సంక్షేమం కొరకు పనిచేసిన వ్యక్తులు, సంస్థలకు భారత ప్రభుత్వ మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ వారు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను అందజేయడం జరుగుతుందని ఆమె చెప్పారు. ఇందులో బాలశక్తి, బాలకళ్యాణ్, సంస్థల పురస్కారాల కేటగిరీలు ఉంటాయని ఆమె ఆ ప్రకటనలో వివరించారు. పురస్కార గ్రహీతలకు 2021 గణతంత్ర దినోత్సవం రోజున గౌ. రాష్ట్రపతి చేతుల మీదుగా పతకంతో పాటు ఐదు లేదా లక్ష రూపాయల నగదు, ధృవపత్రా లను అందజేయడం జరుగుతుందని, అలాగే గౌరవ ప్రధాన మంత్రి వారిచే సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆమె స్పష్టం చేసారు. అర్హులైన బాలలు, వ్యక్తులు, సంస్థలు ఈ నెల 15లోగా www.nca.wcd.nic.in ఆన్‌లైన్ లో నామినేషన్లను సమర్పించాలని ఆమె కోరారు. ఇతర సమాచారం కొరకుపథక సంచాలకులు, జిల్లా మహిళా, శిశుఅభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని గాని లేదా 08942-240630 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని ఆమె ఆ ప్రకటనలో వివరించారు.

## పి.పి.ఇ. కిట్స్, మాస్క్‌లు సరఫరాకు దరఖాస్తులు ఆహ్వానం

విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా రూరల్ పోలీస్ పరిధిలో కోవిడ్-19 కి సంబంధించి పి.పి.ఇ. కిట్లు, మాస్క్ లు, శానిటేషన్ మెటీరియల్ (11 వస్తువులు) కావలసియున్నదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. విజయ లక్ష్మి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల సరఫరా దార్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, విశాఖపట్నం వారిని సంప్రదించి కోవిడ్-19 కి సంబంధించి 11 వస్తువుల జాబితాను స్వీకరించి ఆయా వస్తువులు సరఫరా చేయడానికి ఫైనాన్షియల్ బిడ్ దాఖలు చేయుటకు ఈ నెల 5వ తేదీలోగ టెండరు దరఖాస్తును పొందవలసినదిగా ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బిసి సెల్ వైస్ ప్రెసిడెంట్ యనమల రాజేష్ పుట్టిన రోజు సందర్భంగా అన్నదానం వితరణ



అన్నవరం : తూ.గో.జిల్లా శంఖవరం మండలం అన్నవరం గ్రామంలో తొలి పావంచ వద్ద జిల్లా బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ యనమల. రాజేష్ పుట్టినరోజు సందర్భంగా పేదలకు సుమారు100 మందికి అన్నదానం,వస్త్రదానం చేసారు.ముందుగా ఆయన స్వగ్రామమైన ఏ.వి.నగరంలో కేక్ కట్ చేసి అక్కడ ఉన్న పేదలకు అన్నదానం,వస్త్ర దానం పూర్తి చేసి తదుపరి అన్నవరం లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ రాజేష్ అన్న స్నేహాభావం కలిగిన మంచి మనిషి అని, అన్నని ఏ సహాయం కావాలని కోరిన వారికి పార్టీలకు అతీతంగా సాయం అందజేస్తాడని రాబోయే ఎన్నికల్లో మా నాయకుడు మంచి స్థానం సంపాదించి అందరికి ఆదర్శ ప్రాయంగా నిలుస్తారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కళా గురుకులంలో ప్రవేశాలు ప్రారంభం

శ్రీకాకుళం : శ్రీకాకుళం కల్లేపల్లిలో గల సంప్రదాయం కళా గురుకులంలో ప్రవేశాలు ప్రారంభించడం జరిగిందని సంప్రదాయం కళా గురుకులం సంచాలకులు స్వాతి సోమనాథ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సంప్రదాయం కళా గురుకులం ప్రభుత్వ అనుబంధ సంస్థ అని, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ గుర్తింపు పొందిన కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతము (గాత్రం, వయొలిన్) కోర్సులను నుర్వాహిస్తుందని వివరించారు. గురుకులంలో ప్రవేశములకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. దూర ప్రాంతాల నుండి ప్రవేశం పొందిన 16 సంవత్సరాలకు పైన వయస్సు గల విద్యార్థులకు వసతి, భోజన సదుపాయం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు 7731909837 ఫోన్ నంబరుకు గాని, Sampradaayam2019 @gmail.com మెయిల్ గాని, www.sampradaayam.com వెబ్ సైట్ కు గాని సంప్రదించ వచ్చని ఆమె వివరించారు.

## తోకరాయి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలి

విశాఖపట్నం : విశాఖపట్నం జిల్లా, జి.కె.వీధి మండలం, ధారకొండ పంచాయితీ, తోకరాయి గ్రామంలో అంతుచిక్కని వ్యాధితో ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బ్రతుకుతున్నారు. ఈ 15 రోజుల వ్యవధిలో ఇద్దరు పసిపిల్లలు, ఒక బాలింత వ్యాధితో మరణించారు. దీంతో ఆ గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఒక్కసారిగా ఒళ్ళంతా వాపులు వచ్చి ఆసుపత్రికి తరలించే లోపు మరణిస్తున్నారు.

గిరిజన ప్రాంతంలో ఇప్పటికీ వైద్యం అందక గిరిజనుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఏ చిన్న జ్వరం వచ్చినా అర్థాంతరంగా తనువుచాలిస్తున్న ఘటనలు అనేకం వున్నాయి.

తోకరాయి గ్రామానికి చెందిన రెడ్డి సుశీల (25) బాలింత ఒళ్ళంతా వాపులు, జ్వరంతో బాధపడు తుంటడంతో ధారకొండ ప్రాథమిక ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితిని చూసిన వైద్య సిబ్బంది చింతపల్లి సిహెచ్‌సికి రిఫర్ చేశారు. దీంతో ఆమె మార్గంమధ్యలోనే మృతిచెందారు.

దీంతో గ్రామస్తులంతో తీవ్ర భయాందోళనలతో సతమతమౌతున్నారు.

ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గ్రామానికి ఉన్న రహదారులు దెబ్బతినడంతో అత్యవసర పరిస్థితిలోనూ ఆస్పత్రికి తరలించే అవకాశం లేకుండా పోతుంది.

కొవిడ్ నెపంతో గ్రామానికి వైద్యసిబ్బంది రావడంలేదని, కనీస వైద్య సేవలందడం లేదని గ్రామాస్తులు వాపోతు న్నారు.

కావున తమరు జోక్యం చేసుకొని తోకరాయి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి, రక్తనమోనాలను సేకరించి అంతుచిక్కని ఆ వ్యాధిని గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరుతున్నాం.

# జనవరి నుండి భూముల పున:సర్వే



శ్రీకాకుళం : రాష్ట్రంలో భూముల పున:సర్వే నిర్వహిస్తున్నట్లు సర్వే శాఖ సంయుక్త సంచాలకులు మరియు రాష్ట్ర సర్వే శిక్షణా అకాడమి వైస్ ప్రిన్సిపాల్, వక్ఫ్ శాఖ కమీషనర్ సి.హెచ్.వి.ఎస్.ఎన్.కుమార్ తెలిపారు. శ్రీకాకుళంలో సర్వే శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించుటకు గురు వారం విచ్చేసిన సంయుక్త సంచాలకులు శ్రీకాకుళం ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ 2021 సంవత్సరం జనవరి 1వ తేదీ నుండి భూముల పున:సర్వే చేయుటకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఇది ఒక బృహత్తర కార్యక్రమమని ఆయన పేర్కొన్నారు. వ్యక్తిగత కమతాల వారీగా సర్వే జరుగుతుందని ఆయన చెప్పారు. మూడు దశలలో సర్వే జరుగుతుందని అందుకు తగిన విధంగా సర్వేయర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించుటకు మాడ్యూల్స్ ను తయారు చేసామని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం - కంటిన్యుయస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ (సి.ఓ.ఆర్.ఎస్) నెట్ వర్కుతో పున:సర్వే కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విధానంలో హై ఎక్యూరసి, పారదర్శకత ఉంటుందని ఆయన స్పష్టం చేసారు. రెవిన్యూ శాఖ సమన్వయంతో సర్వే చేపడుతున్నామని తెలిపారు. ఈ విధానంలో సర్వే చేయుటకు సర్వేయర్లకు ఆటో కాడ్, జిపిఎస్ తదితర ఆధునిక వ్యవస్థలలో శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 9,424 మంది సర్వేయర్లు పనిచేస్తున్నారని అందులో 7 వేల మందికి శిక్షణ పూర్తి అయిందని తెలిపారు. ప్రతి జిల్లాలో శిక్షణా కార్యక్రమం సంబంధిత జిల్లా సహాయ సంచాలకులు ఆధ్వర్యంలో జరుగుతుందని ఆయన చెప్పారు. పున:సర్వే పక్కాగా ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యంగా ఉండాలనే ఉద్దేశ్యంతో మంచి ప్రామాణికమైన శిక్షణను అందిస్తున్నామని కుమార్ చెప్పారు. ఇప్పటికే సంబంధిత సర్వే పరికరాలు, శిక్షణా మాడ్యూల్స్ సరఫరా చేసామని ఆయన అన్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ప్రారంభించామని తెలిపారు.

ఈ మీడియా ప్రతినిధుల సమావేశంలో ఏపి సర్వే ట్రైనింగు అకాడమి సహాయ సంచాలకులు టి.త్రివిక్రమ రావు, శ్రీకాకుళం జిల్లా సహాయ సంచాలకులు కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

## గుల్లలపాలెం జీవీఎంసీ ఆసుపత్రి సిబ్బందికి బియ్యం బ్యాగ్స్ పంపిణీ



ములగాడ:58 వార్డ్ వైఎస్సార్ పార్టీ మహిళా అధ్యక్షురాలు చుక్కా వరలక్ష్మి రెడ్డి ఆర్థిక సహాయంతో మాజీ శాసనసభ్యుడు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ చేతులమీదుగా గుల్లలపాలెం జీవీఎంసీ ఆసుపత్రి సిబ్బందికి 5కేజీల బియ్యం బ్యాగ్స్ ను అందజేశారు. గురువారం గుల్లలపాలెం జీవీఎంసీ ఆసుపత్రిలో దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పశ్చిమ వైకాపా సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ళా విజయప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గుల్లలపాలెం జివిఎంసి ఆసుపత్రిలో కరోనా పరీక్షలు చేసి సేవలందించిన ఆసుపత్రిని అభినందించారు. సిబ్బందికి ఒక్కొక్కరికి అయిదు కేజీల బియ్యం బేగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి పొట్టిమూర్తి,వరలక్ష్మి కనకరెడ్డి దంపతులు, రాష్ట్ర మహిళా వైసీపీ నాయకురాలు మళ్ల ధనలత,60 వార్డ్ బిసి సెల్ అధ్యక్షుడు చరకాపు బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

## 76వ వార్డు సమస్యలపై జోన్-5 కమిషనర్ కి వినతి పత్రం



గాజువాక: జోన్ -5 జీవీఎంసీ పరిధి 76 వార్డులో ఉన్న బాల చెరువు, చిన్న కోరాడ, బర్మా కాలనీ, డైరీ కాలనీ, నడుపూరు తదితర ప్రాంతాల్లో ఉన్న పార్కులను శుభ్రం చేయించి మొక్కలు నాటించాలని గురువారం 76వ వార్డు వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ అభ్యర్థి దొడ్డి రమణ జోన్-5 కమిషనర్ శ్రీధర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దొడ్డిరమణ మాట్లాడుతూ వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యే ఆదేశాలమేరకు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెడ్ సి కి వినతి పత్రాన్ని ఇవ్వడం జరిగిందని అన్నారు. జెడ్ సి శ్రీధర్ సానుకూలంగా స్పందించారని ప్రజలకు అన్ని విధాల ఉపయోగపడే పార్కులను త్వరలో శుభ్రం చేయించి మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మార్ట్ పూడి పరదేశి ,నక్క వెంకటరమణ, పిట్టా రెడ్డి, తాటికొండ అచ్యుత్, గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## రైతులకు అందే విద్యుత్ ఉచితమే

అని సీఎం జగన్ తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా ఉచిత విద్యుత్ పథకం అమలు కానున్నట్లు వెల్లడించారు.

**ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు: జగన్**

రైతులకు విద్యుత్ నగదు బదిలీ పథకాన్ని ఏప్రిల్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. రైతుకు అందే విద్యుత్ ఎప్పటికే ఉచితమేనని ఆయన అన్నారు. “ ఒక్క కనెక్షన్ తొలగించబోము, ఉన్న కనెక్షన్లను క్రమబద్ధీకరిస్తాం. విద్యుత్ కనెక్షన్ ఉన్న రైతు పేరుమీద ప్రత్యేక ఖాతా తెరుస్తాం. మీటర్ల ఖర్చు డిస్కమ్‌లు, ప్రభుత్వాలే భరిస్తాయి. ప్రభుత్వం ఖాతాల్లో జమ చేసే డబ్బును రైతులే డిస్కమ్‌లకు చెల్లిస్తారు” అని సీఎం అన్నారు. ప్రస్తుత సంస్కరణల వల్ల రైతుపై ఒక్కపైసా కూడా భారం లేదని సీఎం జగన్ అన్నారు. ఉన్న పథకాన్ని మరింత మెరుగుపరుస్తున్నామన్నారు. 10వేల మెగావాట్ల సోలార్ విద్యుత్‌తో పథకాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. “ వచ్చే 30-35 ఏళ్లపాటు ఉచిత విద్యుత్ పథకానికి ఢోకా లేదు. పగటిపూట 9 గంటల విద్యుత్ ఇప్పటికే 89 శాతం ఫీడర్లలో అమలు చేస్తున్నాం. రబీ సీజన్ నుంచి పూర్తిగా అమలు చేస్తాం. యూనిట్ విద్యుత్ రూ.2.50కే ప్రభుత్వానికి వచ్చేలా చేస్తున్నాం. ఉచిత విద్యుత్ పథకం నిరంతరాయంగా కొనసాగుతుంది. రైతుల కోసమే సోలార్ ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తున్నాం” అని సీఎం వెల్లడించారు. పగటిపూట 9 గంటల విద్యుత్ రాకపోతే రైతులు నిలదీయవచ్చన్నారు. రైతులకు ఎవరికైనా పథకం వర్తించపోతే క్రమబద్ధీకరిస్తామని సీఎం స్పష్టం చేశారు.

**ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు..**

సమాజంలో చెడు ధోరణిలకు కారణమవుతున్న ఆన్‌లైన్ గేమ్స్, (రమ్మీ, పోకర్ ఆన్‌లైన్ జూద క్రీడలు) బెట్టింగులపై నిషేధం విధిస్తూ ఏపీ గేమింగ్ యాక్ట్ - 1974 సవరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్ గేమ్స్ ఆడేవాళ్లకు 6 నెలలు శిక్ష, నిర్వాహకులకు ఏడాది జైలు శిక్ష, రెండోసారి తప్పిదానికి పాల్పడితే రెండేళ్లు జైలు శిక్ష విధించే విధంగా ఏపీ కేబినెట్ నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకం నగదు బదిలీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీ రాజ్ శాఖలో మెరుగైన పాలన కోసం ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. డిప్యూటీ డైరెక్టర్ కేడర్‌లో డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులు ఏర్పాటు కానున్నాయి. మండల పరిషత్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్‌కు పదోన్నతులు కల్పించడం ద్వారా డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ పోస్టులు భర్తీ చేస్తారు. ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌డీసీ) ఏర్పాటు చేస్తూ విడుదల చేసిన జీవో ఎంఎస్ నెంబర్ 80కి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఏపీఎస్‌డీసీ నూరు శాతం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ కాగా.. ప్లానింగ్, ఫండింగ్‌తో పాటు సోషల్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులకు ప్రణాళిక, ఫండింగ్ కార్పొరేషన్ చేయనుంది. కృష్ణా జిల్లాలో ప్రకాశం బ్యారేజ్‌కు దిగువన మరో రెండు కొత్త బ్యారేజీలు నిర్మాణ ప్రతిపాదనలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. రెండు కొత్త బ్యారేజీల నిర్మాణానికి రూ.2565 కోట్లతో ప్రతిపాదన. ప్రకాశం బ్యారేజీకి 12 కిలోమీటర్ల దిగువన కృష్ణా జిల్లా పెనమలూరు మండలం చోడవరం, గుంటూరు జిల్లా మంగళగిరి మండలం రామచంద్రాపురం మధ్య బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1215 కోట్లతో బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదన. ప్రకాశం బ్యారేజీకి 62 కిలోమీటర్ల దిగువన హంసలదీవికి పైన కృష్ణా జిల్లా మోపిదేవి మండలం బండికోళ్లంక, గుంటూరు జిల్లా రేపల్లె మండలం తూరుపుపాలెం నడుమ మరో బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.1350 కోట్లతో బ్యారేజీ నిర్మాణ ప్రతిపాదన. వరికపూడిశెల ఎత్తిపోతల పథకం సమగ్ర సర్వే, డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌కు కేబినెట్ ఆమోదం తెలిసింది. ఈ ప్రాజెక్టు ద్వారా గుంటూరు జిల్లా వెల్దుర్తి, దుర్గి, బొల్లాపల్లి మండలాలకు సాగునీరు అందనుంది. రూ.1273 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణ ప్రతిపాదన. బాబు జగజ్జీవన్‌రామ్ ఉత్తరాంధ్రా సుజల స్రవంతి ప్రాజెక్ట్ ఫేజ్%--%2 నిర్మాణ ప్రతిపాదలకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సుమారు 8 లక్షల ఎకరాల ఆయుకట్టు స్థిరీకరణ సాగు అవసరాల కోసం ఎత్తిపోతల ద్వారా 63.2 టీఎంసీల నీరు అందుబాటులోకి రానుంది. రూ.15389.80 కోట్ల అంచనాలతో నిర్మాణ పనులు చేపట్టనున్నారు. రాయలసీమ ప్రాంతంలో 14 రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాల నిర్మాణం, ఇతర పనులకు సంబంధించిన పరిపాలనా పరమైన అనుమతులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గుంటూరు జిల్లా బాపట్ల మండలం మూలపాలెం, జమ్ములపాలెం గ్రామాల్లో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు అవసరమైన 51.07 ఎకరాల భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదించింది. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరంలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు అవసరమైన 41.97 ఎకరాల భూమిని కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. మావోయిస్టు పార్టీ, దాని అనుబంధ సంఘాలపై మరో ఏడాది పాటు నిషేధం పొడిగిస్తూ తీసుకున్న నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ప్రధాని మోదీ పర్సనల్ వెబ్‌సైట్ హ్యాక్..

సంబంధించి ప్రధాని కార్యాలయం ఇంకా స్పందించలేదు. ప్రధాని ట్విట్టర్ అకౌంట్‌కు సుమారు 2.5 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. మోదీ పర్సనల్ వెబ్‌సైట్, నరేంద్ర మోదీ మొబైల్ అప్లికేషన్‌ను కూడా ఆ అకౌంట్ హ్యాండిల్ చేస్తుంది. ప్రధాని మోదీ పర్సనల్ ట్విట్టర్ అకౌంట్ మాత్రం హ్యాక్ కాలేదన్నారు. దానికి సుమారు 61 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. క్రిప్టోకరెన్సీ పద్ధతితో విరాళాలు ఇవ్వాలంటూ వచ్చిన ట్వీట్లను ప్రస్తుతం తొలగించారు. ఇటీవలే అనేక మంది ప్రముఖుల ట్విట్టర్ అకౌంట్లు హ్యాక్ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ అకౌంట్‌ను కూడా సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసినట్లు తెలుస్తోంది. జూలై నెలలో టెక్నాలజీ దిగ్గజాలు, రాజకీయవేత్తలు, సెలబ్రిటీల అకౌంట్లు హ్యాక్ అయ్యాయి. బరాక్ ఒమాబా, జోసెఫ్ బైడెన్, మైక్ బ్లూమ్‌బర్గ్, జెఫ్ బేజోస్, బిల్ గేట్స్, ఎలన్ మస్క్, కెయిన్ వెస్ట్, కిమ్ కర్దాసిన్ లాంటి ప్రముఖుల ట్విట్టర్ అకౌంట్లు హ్యాక్ అయిన విషయం తెలిసిందే. వెయ్యి డాలర్ల క్రిప్టోకరెన్సీ పంపిస్తే.. దానికి రెండు వేల డాలర్ల కరెన్సీ ఇవ్వనున్నట్లు బోగస్ ట్వీట్లు వచ్చిన విషయం తెలిసిందే.

## బ్యాంకర్లతో ఆర్థిక మంత్రి కీలక భేటీ

రుణసామర్థ్యంపై ప్రభావం లేనివిధంగా వ్యవహరించాలని అన్నారు. రుణ పునర్వ్యవస్థీకరణపై తాము పూర్తిసమాచారాన్ని పలు భాషల్లో తమ వెబ్‌సైట్లపై అందుబాటులో ఉంచామని బ్యాంకులు ఆమెకు వివరించారు. తాము రుణ పునర్వ్యవస్థీకరణకు అర్హులైన రుణగ్రహీతలను గుర్తించే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించామని బ్యాంకులు వివరించాయి. కంపెనీలు, వాణిజ్య సంస్థలతో పాటు వ్యక్తిగత రుణగ్రహీతల అవసరాలను గుర్తెరిగి బ్యాంకులు చురకుగా స్పందించాలని మంత్రి సూచించారు. కాగా, కార్పొరేట్, ఎంఎస్ఎంఈ, వ్యక్తిగత రుణం సహా వివిధ రుణగ్రహీతలకు ఆగస్ట్ 6న ఆర్‌బీఐ రుణ పునర్వ్యవస్థీకరణను ప్రకటించింది. రుణ పునర్వ్యవస్థీకరణ కోసం రుణగ్రహీతలు ఈ ఏడాది డిసెంబర్ 31లోగా బ్యాంకులను కోరవచ్చు. ఈ ప్రతిపాదనకు బ్యాంకులు అంగీకరించిన 180 రోజుల్లోగా రుణ పునర్వ్యవస్థీకరణ అమలవుతుంది.

## తితిదే నిధులపై కాగ్‌తో ఆడిట్ చేయించండి

ఉద్దేశంతోనే నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తితిదే నిధులపై స్వతంత్ర సంస్థలతో ఆడిట్ నిర్వహించాలని కోరుతూ ఇప్పటికే న్యాయస్థానాల్లో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన నేపథ్యంలో ధర్మకర్తల మండలి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

## భారత్‌లో కరోనా కల్లోలం రికార్డుస్థాయి కేసులు

గురువారం నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 38లక్షల 53వేలకు చేరింది. వీరిలో ఇప్పటికే 29.70లక్షల మందికి పైగా కోలుకోగా.. మరో 8లక్షలకు పైగా బాధితులు చికిత్సపొందుతున్నారు. నిన్న మరో 68వేల మంది బాధితులు వైరస్ నుంచి కోలుకున్నట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో కరోనా బాధితుల రికవరీ రేటు 77.1శాతానికి చేరింది. కొవిడ్ మరణాల సంఖ్య పెరుగుతూనే ఉంది. నిన్న ఒక్కరోజే దేశవ్యాప్తంగా మరో 1043 మంది కరోనా రోగులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 67,376కు చేరింది. ప్రస్తుతం భారత్‌లో కరోనా మరణాల రేటు 1.7శాతంగా కొనసాగుతోంది.

## ‘నమస్తే’తో మనసులు గెలుచుకున్న రాజ్‌నాథ్

జోడించారు. మరో సైనికాధికారి సైతం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి ప్రయత్నించగా నమస్కారం చేయడంతో ఆ అధికారి సైతం ప్రతి నమస్కారం చేయడం విశేషం.

మరోవైపు భారత్, రష్యా ద్వైపాక్షిక రక్షణ శాఖ బలోపేతం కావడానికి ఈ సమావేశాలు కీలక పాత్ర పోషిస్తాయని అధికారులు తెలిపారు. కాగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి ఇరు దేశాల సహకరించుకో బాగా ఉపయోగించారు. గతంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో నమస్తే పదాన్ని బాగా ఉపయోగించారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియా వచ్చినపుడు నమస్తే ట్రంప్ పేరుతో ఎన్నో కార్యక్రమాలను నిర్వహించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం నమస్తే పదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. రష్యాలో రాజ్‌నాథ్ ‘నమస్తే’ పెట్టడం ద్వారా భారతీయుల మనసులు గెలుచుకున్నారు.

# సీఎం జగన్.. 'పేదల పక్షపాతి'

## నిరుపేదల కోసం.. పలు సేవా కార్యక్రమాలు..

### ఎంపీ విజయసాయి రెడ్డిని సత్కరించిన

### వైసీపీ మాజీ యువజన అధ్యక్షుడు విల్లూరి భాస్కరరావు



విశాఖపట్నం : ఎంపీ విజయసాయి రెడ్డిని వైసీపీ మాజీ యువజన అధ్యక్షుడు, ప్రముఖ సంఘసేవకుడు విల్లూరి భాస్కరరావు ఘనంగా సత్కరించారు.

నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. స్వర్గీయ వైయస్ వర్ధంతి సందర్భంగా విల్లూరి భాస్కరరావు రెండు రోజులపాటు భారీగా సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాప హోమ్ చిన్నారులకు.. అల్పాహారాలు అందజేశారు.. నిరు పేదలకు పండ్లు, రొట్టెలు, మాస్కులు పంపిణీ చేశారు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి నిరుపేదల గుండెల్లో దేవుడిగా నిలిచారని, ఆయన 'నిరుపేదల ప్రాణదాత' అని కొనియాడారు. సంక్షేమ పథకాలతో.. సీఎం జగన్ పేదల పక్షపాతి అయ్యారని శ్లాఘించారు. సేవా కార్య క్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### భీమిలి జగ్గారావుతోట వద్ద

# గుర్తు తెలియని మృతదేహం లభ్యం



భీమునిపట్నం : భీమిలి బీచ్ రోడ్ లో గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం బీచ్ రోడ్డు జగ్గారావు తోట దగ్గరలో అస్థి పంజరం ఉండడం గమనించిన స్థాని కులు పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహం పూర్తిగా కుళ్ళిపోయి, కేవలం అస్థిపంజరం మాత్రమే మిగిలి ఉందని, మెడలో మాస్కు, నడుంకి నల్లటి త్రాడు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృత దేహం ఆడా, లేదా మగ. చనిపోయి ఎన్ని రోజులు అయ్యింది, హత్యా లేక ఆత్మహత్య అనే విషయం తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సెప్టెంబర్ 5న నిరసనలను విజయవంతం చేయండి

### - సిఐటియు రైతు సంఘం నాయకులు పిలుపు




నిరసన కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

చోడవరం : కేంద్ర ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన నాటి నుండి కార్మికులు, రైతులు, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు చేపడుతున్న దుకు ఈనెల 5న చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. చోడవరం పట్టణంలోని సిఐటియు కార్యాలయం వద్ద గోడ పత్రికను గురువారం ఆవిష్క రించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కు దారాదత్తం చేస్తుందన్నారు. దీనినే సీఐటీయూ పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. అలాగే కరోనా కాలంలో రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఒక్కో కుటుంబానికి నెలకు 1500 రూపాయలు ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం నిరసన కార్యక్రమం గోడ పత్రికను ఆవిష్క రించారు.ఈ కార్య క్రమంలో సిఐటియు రైతు సంఘం నాయకులు ఆర్. శంకర్రావు నాగిరెడ్డి సత్య నారాయణ, ఎస్ఎఫ్ఐ నాయుడు, జి. వర లక్ష్మి పాల్గొన్నారు.

# అప్పన్న బంగారం బిస్కట్లు పేరుతో

## మహిళకు 1.40 కోట్లకు టోకరా

సింహాచలం : అప్పన్న బంగారం బిస్కెట్లు అమ్ముతామని 1.40 కోట్లకు వక మహిళా మరో మహిళకు టోకరా కొట్టించింధిది. నెల్లూరు కు చెందిన శ్రావణి అనే మహిళకు విశాఖ కు చెందిన హైమవతి అనే మహిళా అప్పన్న బంగారం అమ్ముతాము అంటూ కరోనా వల్ల ప్రచారం చేయలేదని నెల్లూరు మహిళకు నమ్మించనది అంతేకాకుండా మాజీ ఆలయ ఈవో భ్రమరాంబ వేలంకి అనుమతి ఇచ్చినట్లు ఫోర్జరీ బిల్లు ను చూపించిన మహిళ కొంత డబ్బులు చెల్లించిన తర్వాత, అనుమానంతో ఆలయ అధికారులను సంప్రదించిన మహిళా కుటుంబ సభ్యులు నిజం తెలిసి లబోదిబో మన్న బాధితులు దీనిపై అధికారులకు ఫిర్యాదు పై స్పందిస్తూ దీనిపైన పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్న దేవస్థానం ఉన్నతాధి కారులు. ఆలయ కోట్ల విలువచేసే బంగారం బిస్కెట్లు కుంభకోణంపై ఈవోను వివరణ అడుగగా ఆలయ అధికారకంగా స్థానిక పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేసి త్వరితగతి గా విచారణ జరిపిస్తామని తెలిపారు.



TAX INVOICE
CASH BILL
Land : 0891-2764
S.V.L.N.S. Devasthanam
Simhachalam Uphills, Simhachalam, Visakhapatnam - 530 0
No.
Date : 27/6/202
M/s. ముద్దూరు నాగేంద్ర కుమార్

| Sl. No. | PARTICULARS | Qty. | Rate | Amount Rs. |
|---|---|---|---|---|
| 1. | గోల్డ్ బిస్కెట్ | 1000 గ్రా | | 40,00,000 |
| 2. | గోల్డ్ బిస్కెట్ | 1000 గ్రా | | 40,00,000 |
| 3. | గోల్డ్ బిస్కెట్ | 500 గ్రా | | 20,00,000 |
| 4. | గోల్డ్ బిస్కెట్ | 250 గ్రా | | 10,00,000 |
| 5. | గోల్డ్ బిస్కెట్ | 250 గ్రా | | 10,00,000 |
| 6. | గోల్డ్ బిస్కెట్ | 250 గ్రా | | 10,00,000 |
| | | | TOTAL | 1,30,00,000 |
| | | | ADVANCE | |
| | | | BALANCE | |

For S.V.L.N.S. Devasthanam
Signature

# చంద్రబాబునాయుడు హయాంలో మత్స్యకారులకు అన్యాయం చేశారు

### మత్స్యకార యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్



భీమునిపట్నం : టిట్లి, పెథాయ్ తుఫాను సమయంలో బోట్లు మునిగిపోయి ఇల్లు కూలిపోయి బ్రతుకు తెరువు లేకుండా రోడ్డు మీద పడ్డ మత్స్యకారులను చంద్రబాబు నాయుడు పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ మత్స్యకార యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షులు వాసుపల్లి జానకిరామ్ విమర్శించారు.రోడ్డున పడ్డ మత్స్యకారులను చంద్రబాబునాయుడు ఆదుకోకుండా కోట్లాది రూపాయలు దుర్వినియోగం చేస్తూ మ్యాచింగ్ ఫెస్టివల్స్, బికినీ ఫెస్టివల్స్, విశాఖపట్నంలో ఏర్పాటు చేసి మత్స్యకారులు పొట్ట కొట్టాడని జానకిరామ్ విమర్శించారు. బాధిత మత్స్యకారులకు న్యాయం చేయాలని మూడు రోజుల క్రితం మంత్రి అవంతి శ్రీనివాస్ రావు ని కలిసి సమస్యను వివరించిన జానకిరామ్, గురువారం సయివాలయంలో మత్స్య శాఖ మంత్రి సిదరి అప్పల రాజు కి సమస్యలపై వినతి పత్రం సమర్పించి మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరారు. చంద్రబాబు నాయుడు హయాంలో మత్స్యకారులకు తొక్క తీస్తా ఇస్తానంటే జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మత్స్యకార సమస్యలన్నిటినీ పరిశీలించి మత్స్యకారులకు పెద్దపీట వేసి ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేయటం, బంగ్లాదేశ్, పాకిస్తాన్ నుంచి జైల్లో ఉన్న వారిని విడుదల చేయించడం ,కరోనా లాక్ డౌన్ సమయంలో గుజరాత్ లో చిక్కుకున్న మత్స్యకారులు మూడు కోట్ల రూపాయలతో స్వస్థలాలకు చేర్చటం, ఇలాంటి వాటితో పాటు మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలు ఇచ్చినటువంటి ఘనత జగన్మోహన్ రెడ్డి కి దక్కుతుందని అన్నారు. ఉత్తరాంధ్ర వలసలు తగ్గించడానికి ముఖ్యమంత్రి తీసుకుంటున్న చొరవ అభినందనీయం అని జానకిరామ్ తెలిపారు.

### మావోయిస్టులకు సహకరిస్తున్న

# ఇద్దరు అరెస్టు - రిమాండ్‌కు తరలింపు



విశాఖసిటీ : విశాఖపట్నం జిల్లా, చింతపల్లి మండలము, అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలో మావోయిస్ట్ పార్టీకి చెందిన ఒకరిని చింతపల్లి సి.ఐ., టి.శ్రీను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు మరియు పెదబయలు మండలము, పెదబయలు పోలీసు స్టేషన్ పరిధిలో సి.పి.ఐ., మావోయిస్ట్ పార్టీకి చెందిన ఇద్దరిని పాడేరు సి.ఐ., పి.పైడపు నాయిడు, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

వారి వివరాలు:

1. బోనంగి నాగేశ్వర రావు.,ఎలియస్ నగేశ్, తండ్రి : బాలయ్య పడాల్, 34 సంవత్సరాలు, భగత, లగడంపల్లి గ్రామం, బలపం పంచాయతీ, చింతపల్లి మండలము, విశాఖపట్నం. ఇతను కోరుకొండ ఏరియా మిలిషియా కమాండర్, కోరుకొండ దళం, 2005 సంవత్సరం నుంచి మావోయిస్ట్ పార్టీలో మిలిసియా మెంబర్ గా పనిచేస్తున్నాడు. ఇతన్ని చింతపల్లి సి.ఐ., టి.శ్రీను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

**పాల్గొన్న నేరాలు** : 1. గెమ్మిళి భాస్కర రావు మరియు పాంగి సత్తిబాబులను వీరవరం గ్రామంలో హత్య చేసిన సంఘటనలో పాల్గొన్నాడు. 2. ఇటీవల చింతలవీధి లో ఇద్దరు గిరిజనులు మందుపాత్ర పేలుడులో చనిపోయిన సంఘటనకు బాధ్యుడు. 3. లండులు గ్రామ అటవీ ప్రాంతములో జరిగిన ఎదురుకాల్పుల సంఘటనలో పాల్గొన్నాడు. 4. పోలీసులను చంపాలనే ఉద్దేశంతో మందుపాత్రలను అమర్చడం చేసేవాడు. 5. కొర్రా నాగేశ్వర రావు, ఎలియస్ గిల్లెలబంద నాగేశ్వర రావు మావోయిస్ట్ ఏ.సి.ఎం., ప్రోద్బలంతో కాంట్రాక్టర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడేవాడు. 6. ప్రభుత్వ అధికారులను, గ్రామ పెద్దలను బెదిరించడం, గిరిజనులను మావోయిస్ట్ సమావేశాలకు, ర్యాలీ లకు బలవంతంగా తీసుకెళ్ళడం, టార్గెట్ వ్యక్తుల సమాచారం సేకరించి మావోయిస్ట్ లకు చేరవేయడం, అమాయక గిరిజనులను చంపేటప్పుడు మావోయిస్ట్ లకు సహకరించడం, మావోయిస్ట్ లకు కావల్సిన వస్తువులను అందజేయడం, మావోయిస్ట్ లకు భోజనాలు, వసతి కల్పించడం మొదలైనవి చేస్తుండేవాడు. 2. 1. గడుతూరి రామచంద్ర పడాల్, ఎలియస్ చంద్ర, 35 సంవత్సరాలు, తండ్రి : పొట్టి పడాల్, భగత, గిన్నె లెకోట గ్రామము,

పెదబయలు మండలము, విశాఖపట్నం జిల్లా, ఇతను 2016 నుంచి గిన్నెలకోట పాకెట్ మిలిషియా కమిటీ మెంబర్, పెదబయలు దళం. 2. సింద్రీ అప్పారావు, ఎలియస్ ముగిరి, తండ్రి: చిట్టిబాబు, 31 సంవత్సరాలు, కొందు, సాలెబు గ్రామం, ఇంజరి పంచాయత్, పెదబయలు మండలము, విశాఖపట్నం జిల్లా, ఇతను 2013 నుంచి అర్మేడ్ మిలిషియా పెదబయలు, పెదబయలు దళం. వీరిద్దరిని పాడేరు సి.ఐ., పి.పైడపు నాయిడు, అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

**పాల్గొన్న నేరాలు** : 1. పాంగి శివయ్య ను బూసిపుట్టు, ముంచింపుట్ మండలం వద్ద హత్య చేసిన సంఘటనలో పాల్గొన్నారు. 2. కొర్రా రంగారావు, కొలకని సూర్య, కొర్రా సత్తిబాబు మొదలైన వారిని చంపిన సంఘటనలో పాల్గొన్నారు. పాల్గొన్నారు. 4. బూసీ పుట్టు మరియు సుల్తాన్ పుట్టు అటవీ ప్రాంతంలో రోడ్డు యంత్రాలను తగులపెట్టిన సంఘటనలో పాల్గొన్నారు. 5. మావోయిస్ట్ వారోత్సవాళ్ళలో పోలీసు పార్టీ లను చంపే ఉద్దేశంతో సాలెబు - చీకటిపల్లి ప్రాంతాలలో మందుపాత్రలను అమర్చేవారు. 6. మావోయిస్ట్ దుశ్చర్యలలో సెంట్రీ విధులను చేసేవారు. 7. ప్రభుత్వ అధికారులను, గ్రామ పెద్దలను బెదిరించడం మొదలైనవి చేస్తుండేవారు. ఈ సందర్భంగా సి.ఐ లు, మాట్లాడుతూ తమ ప్రాంతాలలో మావోయిస్ట్ మిలిషియా సభ్యులు సమాచారం తమ వద్ద ఉందని, వారు తెలిసో తెలియాకో మావోయిస్ట్ సహకరిస్తూ, వారి కార్యక్రమాలలో పాల్గొంటున్నారని వారు స్వచ్ఛంధంగా లొంగిపోవాలని, వారిపై ఎటువంటి పోలీసు కేసులు నమోదు చేయమని, లొంగి పోయినవారికి పునరావాసం ప్రభుత్వం ద్వారా కల్పిస్తామని అన్నారు.

# రూ. 188.50కోట్లతో మన్యంలో 938 ఉపాధి పనులు

### అభివృద్ధిలో మన్యం అగ్రస్థానంలో నిలవాలి : ఐటిడిఏ పిఓ డాక్టర్ వేంకటేశ్వర్ సలిజాముల



పాడేరు : మన్యంలో రూ.188 కోట్ల 50 లక్షల విలువైన నిర్మాణపు పనులు జరుగుతున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ సలిజాముల ఆదేశించారు. గురువారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో పంచాయతీ రాజ్, గిరిజన సంక్షేమశాఖ, ప్రత్యేక నీటి పారుదల, రహదారులు భవనాలు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో ఉపాధిహామీ కన్వర్షన్ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పనులు పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం నేతృత్వంలో జరుగున్నాయని, పనిభారం పెరిగి నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారని,

జిల్లా కలెక్టర్ అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులను బాధ్యులను చేస్తూ ఉత్తర్వులు జారీ చేసారన్నారు. ప్రతీ మండలానికి ఒక ఉపకార్య నిర్వహక ఇంజనీరు, 4 సహాయక ఇంజనీర్లు విధులు నిర్వహిస్తారని చెప్పారు. అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులు ఈ పనులు మావికావు అనే భావన విడనాడి సమన్వంతో మార్చి నెలాఖరునాటికి పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మన్యంలో పెద్ద ఎత్తున ఉపాధి నిధులు ఖర్చు చేయా లన్నారు. 11 మండలాలలో 1629 పనులు జరుగుతున్నాయన్నారు. వీటిలో 1600 ల భవన నిర్మాణాలు ఉన్నాయన్నారు. ఇంజనీర్లకు అప్పగించిన పనిని నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయాలన్నారు. వారానికి రూ.9.61 కోట్ల ఖర్చు చేయాలన్నారు. ప్రతీ వారం పనుల పురోగతిపై సమీక్షిస్తామన్నారు. ప్రహరీ గోడల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిర్మాణానికి పటిష్టమైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. మార్చి నెలాఖరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

పంచాయతీ రాజ్ శాఖ సూపరింటెంట్ ఇంజనీర్ జి. సుధాకర రెడ్డి మాట్లాడుతూ రూ.84.56 కోట్ల తో 212 గ్రామ సచివాలయ భవనాలు, రూ.45.58 కోట్లతో 209 రైతు భరోసా కేంద్రాలు, రూ.20.18 కోట్ల తో 135 వై ఎస్ ఆర్ హెల్త్ క్లీనిక్లు, రూ.38.28 కోట్లతో 382 అంగన్వాడీ భవన నిర్మాణాలు జరుగు తున్నాయన్నారు. భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని రావాలన్నారు. ఈ సమావేశంలో గిరిజన సంక్షేమ శాఖ ఇ ఇలు కెవి ఎస్ ఎస్ కుమార్, జి.మురళి, పంచాయతీ రాజ్ ఇ ఇ. ఆర్ కె భాస్కర్, పి ఐయు ఇ ఇ శ్రీనివాస్, అన్ని శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# చేతివాటం ప్రదర్శిస్తే చర్యలు తప్పవు : .ఎమ్మెల్యే ఫాల్గుణ



అరకులోయ : అరకులోయలో గల ప్రాంతీయా పశువైద్యశాల కార్యాలయంలో గురువారం గౌరవ అరకు శాసన సభ్యులు చెట్టి.పాల్గుణ అరకులోయ తోపాటు 5 మండలాల పశుసంవర్ధక శాఖ అధికార బృందాలతో సమీక్ష సమావేశం పెట్టడం జరిగింది. ఈ సమావేశంలో బాగంగా శాసన సభ్యులు చెట్టి.ఫాల్గుణ వివిధ మండలాల ఉద్యోగులతో మాట్లాడుతూ, పశుపెంపక రైతులకు,మా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాలను లబ్ధిదారులకు చేరే భాగంలో మీ వంతు ఉద్యోగ బాధ్యతను సక్రమంగా ఉద్యోగులు నిర్వర్తించాలని అన్నారు. ఎటువంటి చేతివాటం ప్రదర్శించ కూడదని, ప్రదర్శిస్తే ఉద్యోగం నుండి తొలగించబడుతుందని పశుసంవర్ధక ఉద్యోగులకు హెచ్చరించి స్వయనా నేనే ఉద్యోగం నుండి తొలగి స్తానని అన్నారు.అలాగే గిరిజన ప్రాంతంలో పిడుగు పాటుకు గురైన పశువులకు,మేకలకు, తక్షణమే నష్టపోయిన రైతులకు,పశుభిమా వెంటనే కల్పించాలని అన్నారు.పశు పెంపక రైతులను తమ పశువుల నుండి నష్టం జరిగి పశు వులు చనిపోతే సంబందిత ఉద్యోగ సిబ్బంది చొరవ తీసుకొని ఆదుకోవాలి,అలాగే గిరిజన ప్రాంత రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకాల గురించి అవగహన కల్పించే కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అశ్వధామ (అరకు ఏడి మరియు డీడీ పాడేరు ఇంఛార్జి)డాక్టర్ రవికుమార్ ఏడి (పాడేరు)డాక్టర్ త్రినాధ్‌రావు ఏడి (పెదబయలు)డాక్టర్ గణేశ్వరరావు (అరకులోయ)డాక్టర్ గౌతమ్ (డుంబ్రిగుడ)డాక్టర్ శీనయ్య (కించుమండ)డాక్టర్ అనీల్ కుమార్ (అనంతగిరి)డాక్టర్ భరత్ కుమార్ (కాశీపట్నం)డాక్టర్ సునీల్ కుమార్ (హుకుంపేట)డాక్టర్ కుసుమ ప్రియా దర్శిని (జోలపుట్)డాక్టర్ రాజేశ్వరి (పెదబయలు) మరియు పారా సిబ్బందులు ఏ.ఎచ్.ఎ పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## చైనా దుడుకుతనం

భారత్- చైనా సరిహద్దు ప్రాంతం తీవ్ర ఉద్రిక్తంగా మారింది. యుద్ధవిమానాల చక్కర్లు, భారీ యుద్ధట్యాంకుల మోహరింపులతో అక్కడి నిర్మల హిమగిరులు సెగలు కక్కుతున్నాయి. పాంగాంగ్ ఉత్తర రేవును డ్రాగన్ దురాక్రమించినందుకు ప్రతిచర్యగా దక్షిణ రేవును మన సేనలు అధీనంలోకి తీసుకొని ఆ ప్రాంతంలోని కీలక పర్వత శిఖరాలను స్వాధీనం చేసుకున్నాయి. ముఖ్యంగా 'బ్లాక్‌టాప్'గా పేర్కొనే పర్వత శిఖరాన్ని అధీనంలోకి తీసుకోవటంతో ఆ ప్రాంతంపై భారత్ పట్టుసాధించినట్లయ్యింది. ఈ పర్వత శిఖరాల పైనుంచి ఆ ప్రాంతంలో చైనా సైనిక దళాల కదలికలను పూర్తిగా గమనించే వీలుండటంతో డ్రాగన్ బిక్కమొహం వేసింది. చైనా కుయుక్తులు, ఎత్తులకు పై ఎత్తులతో భారత్ ప్రతిస్పందిస్తున్నది. గల్వాన్ లోయలో రెండున్నర నెలల కిందటి చైనా దొంగదెబ్బకు ప్రతిగా భారత్ దీటుగా జవాబిస్తున్నది.

సరిహద్దుల్లో చైనా కుతంత్రాలు మనకు కొత్త కాదు. వలసపాలన కాలంనాటి సరిహద్దు సమస్యలను వివాదం చేస్తూ భారత్‌తో చైనా తగాదాకు దిగుతున్నది. అస్పష్ట సరిహద్దు రేఖను పునర్నిర్వచించుకోవాలనే పేరుతో భౌగోళికంగా కీలక భూభాగాలను తమవిగా చెప్పుకొంటూ దురాక్రమణలు చేస్తున్నది. 1969నాటి యుద్ధం మొదలు నిన్నమొన్నటి గల్వాన్ ఘర్షణ దాకా దొంగచాటు చొరబాట్లకు పాల్పడుతున్నది. తాజాగా చుషుల్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న మోల్డో నుంచి చైనా రాత్రివేళ భారీగా యుద్ధట్యాంకులు, సైనిక వాహనాలను తరలించింది. పాంగాంగ్ దక్షిణ రేవులోని పర్వత శిఖరాలను ఆక్రమించుకోవాలనేది డ్రాగన్ ఎత్తుగడ. ఇది గమనించిన భారత్ అప్రమత్తమై చైనాను నిలువరించింది.

అంతర్గత సంక్షోభాలు, రాజకీయ అస్థిరతలను అధిగమించేందుకు పాలనాధీశులు యుద్ధాలకు, సరిహద్దు వివాదాలకు తెరతీస్తారని వర్తమాన ప్రపంచ ఘటనలు చెప్తున్నాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కూడా అదే తోవలో నడుస్తూ దక్షిణాసియాలో ఉద్రిక్తతలకు కారణమవుతున్నారు. సాంస్కృతిక విప్లవ కాలంలో చైనాలో ఏర్పడిన రాజకీయ అస్థిరత, సంక్షోభాన్నుంచి గట్టెక్కేందుకు యుద్ధానికి తెగబడినట్లుగానే, నేడు కూడా జిన్‌పింగ్ కరోనా సంక్షోభం నుంచి బయటపడేందుకు సరిహద్దు వివాదాలను సృష్టిస్తున్నాడు. ఇంతా చేసి వాస్తవాధీన రేఖను భారత్ అతిక్రమిస్తున్నదని చైనా ఆరోపణలు చేస్తున్నది! రెండు దేశాల యుద్ధ ట్యాంకులు పరస్పరం దాడి చేసుకునేంత దగ్గరలో మోహరించి ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. సమస్యలేవైనా చర్చల ద్వారానే పరిష్కారమవుతాయనేది ఆధునిక ప్రపంచం నేర్పిన నాగరిక నీతి. ఆయుధాలు, యుద్ధాలు వినాశనాన్నే మిగుల్చుతాయి. కరోనా మహమ్మారితో ప్రపంచమంతా సామాజికంగా, ఆర్థికంగా విలవిలలాడుతున్న సమయంలో యుద్ధవాతావరణం అవాంఛనీయం. చైనా దుడుకుతనం గర్హనీయం.

## లాభాల్లో ప్రారంభమై.. నష్టాల్లో ముగిశాయ్

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఫార్మా, ఆటో రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించినప్పటికీ.. బ్యాంక్, మెటల్ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవడంతో రెండు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. ఉదయం 39,211 పాయింట్లతో లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ ఆద్యంతం ఒడుదొడుకులకు లోనైంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నేల చూపులు చూసిన సూచీ.. మళ్లీ పుంజుకున్నట్లు కనిపించినా చివర్లో మళ్లీ నష్టాల్లోకి జారుకుంది.

చివరికి 95.09 పాయింట్ల నష్టంతో సెన్సెక్స్ 38,990.94 వద్ద ముగిసింది. నిఫ్టీ 7.50 పాయింట్లు కోల్పోయి 11,527.50 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 73.47గా ఉంది. నిఫ్టీలో భారతీ ఇన్‌ఫ్రాటెల్, గ్రాసిమ్ ఇండస్ట్రీస్, టైటాన్ కంపెనీ, యూపీఎల్, విప్రో షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందాల్కో ఇండస్ట్రీస్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ నష్టాలు చవిచూశాయి.

## శృంగార సమయంలో మాస్క్ తప్పనిసరి..



న్యూఢిల్లీ : శృంగార సమయంలో మాస్క్ ధరించాలని కెనడా ప్రభుత్వ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ థెరిసా టామ్ సూచించారు. బయటి వ్యక్తులతో శృంగారం చేయాలనుకున్న సమయంలో మాస్క్ ధరించాలని ఆమె అన్నారు. కిస్సులు ఇవ్వడం కూడా మానేస్తే బెటర్ అన్న అభిప్రాయాన్ని ఆమె వినిపించారు. కోవిడ్19 వేళ శారీరకంగా దగ్గర అయ్యే సందర్భాలను దూరం పెట్టాలన్నారు. వైరస్ వ్యాప్తిని, సంక్రమణను అడ్డుకోవాలంటే ఇదొకటే సూత్రమన్నారు. వాస్తవానికి మహమ్మారి వేళ శృంగారాన్ని నివారించేడమే ఉత్తమ మార్గం అని ఆమె తెలిపారు. శృంగార వేళ మాస్క్ ధరించడం వల్ల వైరస్ వ్యాప్తి తక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు ఆమె చెప్పారు. ప్రస్తుతం ఉన్న నివేదికల ఆధారంగా.. వీర్యం, యోని ద్రవాల ద్వారా కోవిడ్19 వ్యాపిస్తుందన్న సాక్ష్యాలు ఏమీ లేవన్నారు. కానీ కొత్త భాగస్వాములతో శృంగారంలో పాల్గొంటే.. అప్పుడు వైరస్ త్వరగా వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నట్లు డాక్టర్ థెరిసా చెప్పారు. లవర్లు కూడా కిస్సులు ఇచ్చుకోవడం ఆపాలన్నారు. ఫేస్ టు ఫేస్ కాంటాక్ట్ కూడా నిరోధించాలన్నారు. సురక్షితమైన శృంగారాన్ని కొనసాగించాలంటే కండోమ్‌లు వాడాలని ఆమె సూచించారు. కెనడాలో ఇప్పటి వరకు లక్షా 30 వేల కరోనా పాజిటివ్ కేసులు నమోదు అయ్యాయి. దాంట్లో 9132 మంది మరణించారు. 88 శాతం రోగులు కోలుకున్నట్లు డాక్టర్ థెరిసా వెల్లడించారు.

## 118 యాప్‌లపై నిషేధం.. చైనా ఆందోళన



బీజింగ్ : పబ్‌జీ సహా 118 యాప్‌లను నిషేధిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై చైనా గురువారం స్పందించింది. చైనా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి గో ఫెంగ్ మాట్లాడుతూ దేశం తీసుకున్న నిర్ణయంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇన్వెస్టర్లు, సర్వీస్ ప్రొవైడర్ల చట్టబద్ధ ప్రయోజనాలను భారత్ ఉల్లంగించిందని ఆరోపించారు. చైనా యాప్‌లపై బ్యాన్ విధించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. భారత్ నిర్ణయం విచారకమని, మరోసారి నిర్ణయాన్ని పునః సమీక్షించుకోవాలని కోరారు. కాగా, భారత సైబర్ స్పేస్ భద్రతే లక్ష్యంగా పబ్‌జీ సహా 118 చైనా యాప్‌లను నిషేధిస్తూ నిర్ణయం విషయం తెలిసిందే. పలు యాప్‌లు యూజర్ల డేటాను చట్టవిరుద్ధంగా భారత్‌కు వెలుపల ఉన్న సర్వర్లకు చేరవేస్తున్నట్లు తమకు వివిధ వర్గాల నుంచి ఫిర్యాదులు అందినట్లు ప్రభుత్వం తెలిపింది. దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, రక్షణ, భద్రతా ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ 'హానికర యాప్'లపై నిషేధం విధించాలని హోంశాఖకు చెందిన సైబర్ క్రైమ్ సెంటర్ సిఫార్సు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. భారత్‌లో దాదాపు 3.3 కోట్ల మంది క్రియాశీలక పబ్‌జీ యూజర్లు ఉన్నట్లు అంచనా. నిషేధానికి గురైన వాటిలో పబ్‌జీతోపాటు పబ్‌జీలైట్, బైదు, బైదు ఎక్స్‌ప్రెస్ ఎడిషన్, టెన్సెంట్ వాచ్‌లిస్ట్, ఫేస్‌యూ, వియ్‌చాట్ రీడింగ్, టెన్సెంట్ వీయూన్ వంటి యాప్‌లు ఉన్నాయి. అలాగే జూన్‌లో టిక్‌టాక్ సహా 59 యాప్‌లపై బ్యాన్ విధించింది.

## 'కోహ్లీ భారతీయుడు అయినందుకే ద్వేషించాలా?'

### పాకిస్థాన్ అభిమానులకు షోయబ్ అక్తర్ చురక..



న్యూఢిల్లీ : పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ తన యూట్యూబ్ ఛానల్‌లో ఎప్పుడూ సమకాలిన క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లపై తన అభిప్రాయాలు వ్యక్తపరుస్తుంటాడు. సందర్భాన్ని బట్టి ఒక్కోసారి పాకిస్థాన్ ఆటగాళ్ల ప్రదర్శనలను కూడా ఎండగడుతుంటాడు. ఆటగాళ్ల నైపుణ్యాలను, వారి తప్పులను తెలియజేస్తాడు. అలాగే ఇతర దేశాల క్రికెటర్లు ఎవరైనా మంచి ప్రదర్శన చేసినా వారిని మెచ్చుకుంటాడు. ఈ క్రమంలోనే పలుమార్లు టీమ్ఇండియా బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను సైతం కొనియాడాడు. తనకు నచ్చితే ఎవరైనా ఒక్కటే అనే సిద్ధాంతాన్ని బలంగా నమ్ముతాడు. దాంతోనే కల్మశం లేకుండా తన అభిప్రాయాలు, విశ్లేషణలను అభిమానులతో పంచుకుంటాడు. అయితే, అక్తర్.. టీమ్ఇండియా ఆటగాళ్లను పొగడడంపై పాకిస్థాన్‌లో కొందరు అభిమానులకు నచ్చదు. దీంతో అతడిపై తీవ్ర విమర్శలు చేస్తుంటారు. ఇదే విషయాన్ని ఒక పాకిస్థాన్ క్రికెట్ ఛానల్ అతడిని ప్రశ్నించింది. దానికి అక్తర్ కూడా అంతే దీటుగా సమాధానమిచ్చాడు.

భారత కెప్టెన్ విరాట్ కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాట్స్‌మన్ అని, అతడి రికార్డులే ఆ విషయాన్ని చెబుతాయని మాజీ పేసర్ అన్నాడు. పాక్ క్రికెట్‌లో లేదా ప్రపంచ క్రికెట్‌లో అతడిలా ఆడే బ్యాట్స్‌మన్ ఎవరున్నారని ప్రశ్నించాడు. టీమ్ఇండియా సారథి ప్రశంసలకు అర్హుడని చెప్పాడు. అలాంటప్పుడు తాను కోహ్లీని లేదా రోహిత్ శర్మను పొగిడితే తప్పేంటని నిలదీశాడు. ఈ విషయంలో పాక్ అభిమానులు ఎందుకు తనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారో తెలియదన్నాడు. వాళ్లంతా వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలన్నాడు. తనని విమర్శించే ముందు కోహ్లీ గణంకాలను చూడాలని హితవు పలికాడు. 'అతడు కేవలం భారతీయుడు అయినందుకే ద్వేషించాలా? మనం వాళ్లని పొగడకూడదా?' అంటూ అసహనం వ్యక్తం చేశాడు. అతి తక్కువ కాలంలోనే 70 అంతర్జాతీయ శతకాలు నమోదు చేశాడని, అతడిలా ఎవరు సాధించారని అడిగాడు. ప్రస్తుతం టీమ్ఇండియా కెప్టెన్, వైస్ కెప్టెన్ అద్భుతంగా రాణిస్తున్నారని, వాళ్లని ద్వేషించడం విడ్డూరంగా ఉందని అక్తర్ పేర్కొన్నాడు.

## సమకాలీనం

### భూతల స్వర్గం

**వీడొక్కడు- వాడొక్కడు**
**అతనొక్కడు - ఆమెక్కటి**
**అల్లాడొక్కడు ఈ పంచ భూతాలతో,**
**ఒక్కొక్కరించె ఆడించుచున్నాడు**
**అద్భుత లీలలు ఇంకొక్కడు వాడే;**
**ఆ, భగవంతుడొక్కడే.**
**ఏదో పోటు పొడ్సినట్లు ప్రొద్దునే**
**తయారవుతాడు సూర్యుడొక్కడు**
**వీడికి ఇదే పని, వేరే పనిపాటు లేదు రోజూ**
**తన చుట్టూ తాను తిరుగుతూ;**
**సూర్యుని చుట్టూ తిరుగుతుంది**
**పిచ్చి తల్లి భూమి ఒక్కటి**
**దీనికి ఇదే పని, వేరే పనిపాటు లేదు రోజూ** ...'వీడొక్కడు'
**ఈ చల్లని రేయిలో - నులి వెచ్చని హాయిలే**
**అంటూ; రాత్రి అయ్యేసరికి సోగ్గాడులా**
**చక్కని చుక్కలతో రాసలీలలకై;**
**ఆకాశ పరుపుపై తయారౌతుంటాడు చంద్రుడొక్కడు**
**వీడికి ఇదే పని, వేరే పనిపాటు లేదు రోజు**
**వీడిలానే భూతలంపై జనులు-జనాభాన్ని**
**అధికం చేస్తున్నారు.**
**రాత్రంటూ, లేకుంటే-కాకుంటే;**
**జనాభా తగ్గుముఖమైయ్యేదేమో!**
**భూమిని-భూతల స్వర్గం ఎంతగానో చేశాడు**
**చేస్తునే ఉన్నాడు మనిషి**
**ఐనా! - కాని ఆ, భగవంతుడు అడ్డు తగులుతున్నాడు**
**ఆ, స్వర్గ సుఃఖం అనుభవించకుండానే**
**మద్యంతరములోనే- ఆ, మనిషిని మాయ చేస్తున్నాడు**
**నన్ను మాయ చేస్తే- నా వారసులెందరో!**
**పుడుతునే ఉంటారు - నా ఉనికిని పురోగతిని చేస్తారు** ...'వీడొక్కడు'
**చంద్రుడున్న ఆకాశాన్నే అమావాస్య చీకటి చేస్తాడు**
**మనిషున్న భూమిని అమావాస్య చీకటి చేయడం**
**ఓ లెక్క!... ఆ, భగవంతునికి**
**వానగాడ్నో... గాలి గాడ్నో పంపించి**
**భూతల స్వర్గాన్ని - బుగ్గిపాటు చేస్తాడు**
**మా స్వర్గంకు మించే స్వర్గం ఇంకొకటి**
**ఉండకూడదని ఆ, భగవంతుడు మనిపై;**
**ఆడే తోళ్లు బొమ్మలాట**
**తన ఉనికిని- ఆపుకోలేకున్నాడు మనిషి**
**భూతల స్వర్గం చెయ్యకుండా ఉండేదుకై;**
**పగలు - రాత్రి**
**చావూ - పుట్టుకలు**
**మనిపై ఏర్పర్చాడు ఆ, భగవంతుడు** ...'వీడొక్కక్కడు'

**... కవితా రచన**
**యల్.సిద్ధు**

## పంచాంగం

మాసం : భాద్రపద; తిథి : విదియ ప.12.17; ఉ.భా.రా.10.37; ఉ.వ.6.52ల 8.36.

**శుక్రవారం 04-09-2020**

**మేషం** : చేపట్టిన పనులు ఆశించినంత చురుకుగా సాగవు. భాగస్వామిక చర్చలు, సంప్రదింపులకు అనుకూలం. స్త్రీలకు ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం. శాస్త్ర రంగాల వారికి పరిశోధనలు, ప్రయోగాలకు మంచి గుర్తింపు లభిస్తుంది. మీ ఆలోచనలు, పథకాలు కార్యరూపం దాల్చుతాయి. **వృషభం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సా హకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** : ఉపాధ్యాయులకు, రిప్రజెం టేటివ్‌లకు సదవకాశాలు లభిస్తాయి. స్త్రీలకు ఆరోగ్యంలో అధికమైన జాగ్రత్త అవసరం. **కర్కాటకం** : స్థిరాస్తుల అమ్మకానికై చేయు యత్నాలు వాయిదా పడతాయి. ఉద్యోగస్తులకు అధికారులతో అప్రమత్తత అవసరం. విద్యార్థులకు మిత్రబృందాలు, వ్యాపకాలు అధికం కాగలవు. దీర్ఘకాలికం **సింహం** : విద్యార్థులు మానసికంగా స్థిమితపడతారు. ప్రవేట్ ఫైనాన్సులో మదుపు, వ్యక్తులకు రుణం ఇవ్వటం క్షేమం కాదు. దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. గృహమార్పు యత్నం అనుకూలిస్తుంది. స్టేషనరీ, ప్రింటింగ్ రంగాల వారికి పురోభివృద్ధి కానవస్తుంది. **కన్య** : ధనసహాయం చేసే విషయంలో అప్రమత్తత అవసరం. దైవదర్శనాలలో ఇబ్బందులను ఎదుర్కొం టారు. ఉద్యోగస్తులు ఓర్పు, నేర్పుతో విజయాన్ని సాధించగలరు. మధ్యవర్తిత్వం వహించటం వల్ల మాటపడక తప్పదు. మార్కెటింగ్ రంగాల్లో ఒత్తిడి పెరుగుతుంది. పాత వస్తువుల వల్ల ఇబ్బందులు తలెత్తుతాయి. **తుల** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాల్లో నిలదొక్కు కుంటారు. జీవితభాగస్వామి ద్వారా ఆర్థిక లాభం పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలు, చిరు వ్యాపారులకు సామాన్యం. ప్రముఖుల కలయిక వల్ల ఆశించిన ఫలితం ఉంటుంది. నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు, బిల్డర్లకు స్వీయ పర్యవేక్షణ ముఖ్యం.

## అయ్యప్ప చింతనతో... సంకీర్తన



### అయ్యప్ప ఎవరు..!

హరిహర సుతుడుగా అయ్యప్ప అవతరించినట్టు చరిత్ర చెపు తుంది. అయితే ఒకప్పటి కాలానికి వెడితే, విష్ణువుని ఆరాధించే వారిని వైష్ణవులని, శివుణ్ణి ఆరాధించేవారిని శైవులని, బ్రహ్మని ఆరాధించే వారంతా బ్రాహ్మణులని వర్గీకరణ జరిగింది. అయితే శృష్టిస్థితిలయ కారకులుగా రూపుదిద్దుకున్న ఆ పరమేశ్వరుని రూపాన్ని , భగవంతుడు ఒక్కడే అనే నిజాన్ని విస్మరించి, ఈ త్రిమూర్తులలో ఎవరు ఎక్కువ అనే తత్వం ఈ మూడు వర్గా ల్లోనూ తలెత్తింది. విష్ణువే ఎక్కువ అని వైష్ణవులు, శివుడే ఎక్కువ అని శైవులు వాదించుకోవడం మొదలు పెట్టి, హత్యలు చేసు కునే స్థితికి చేరుకున్నారు. బ్రాహ్మ ణులు ఇద్దరి మధ్య మీమాంశలో పడి కొందరు వైష్ణవుల్లోను, అత్యధిక శాతం శైవుల్లోను కలిసి పోయారు. శైవుల మధ్య వైష్ణవుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన విబేధాల వల్ల రక్తపాతం జరుగుతూ వుండేది. హిందూ సమాజం అస్తవ్యస్థంగా మారింది. చివరికి విష్ణు భక్తులు పెట్టు కునే నామాలు కూడా శైవులు నాకి అవ మానించేవారు. ఆ కోపావేశంలో శైవుల్ని హత్యచేయడానికి విషం కలిపిన నిలువునామాలు పెట్టుకునేవారు. వీరి నామాలు నాకిన శైవులు విప్రపభావంతో మరణించేవారు. ఎవరికి వారు మా మతం గొప్పదంటే, మా మతం గొప్పది అంటూ ఆధిపత్యపోరు నిరంతరం సాగిస్తూవుండటంతో సమాజంలో అశాంతి ప్రబలి పోయింది. సాధారణ ప్రజానీకం కూడా ఎవరు ఏమిటో తెలియని వాతా వరణంలో కుమ్ములాటలకి దిగడం పరిపాటిగా మారింది. చివరికి రాజవంశాల్లో కూడా ఇదమిద్ధంగా సరైన అవగాహన లోపించడంతో రారాజులు, మహారాజులు కూడా ఈ విషయంలో నిర్లిప్తధోరణి పాటించారు. సమైక్యతకి కొందరు ప్రయత్నించినా ఫలితం అంతగా కనిపించలేదు. ఇంతటి అస్థిర పరిస్థితిని అదుపుచేసి, సుస్థిర సమాజస్థాపనకోసం హరిహరులు ఒక్కరే అని చేప్పే నేపథ్యంలో హరిహర సుతుడుగా ఇద్దర్నీ ఏకంచేస్తూ ఉద్భవించినవాడే అయ్యప్ప.

### అయ్యప్ప చరిత్ర

ఏ పురాణేతిహాసాల్లోను మనకి తెలిసినంతవరకూ అయ్యప్ప ప్రస్తావన ఉండదు. అయితే భస్మాసురుని సంహ రిం చడంకోసం శ్రీహరి జగన్మోహినిగా అవతరించడం, భస్మాసురుడికి వరాన్ని అనుగ్రహించి తన నెత్తిమీదికి తెచ్చుకుని కష్టాల్లో పడిన పరమ శివుణ్ణి రక్షించడం, జగన్మోహినిగా ఉన్న శ్రీహరిని చూసి శివుడు మోహించి కొంతకాలం తనతో దాంపత్యం చేయడం, ఆ దాంపత్య కారణంగా ఒక బాలుడు పుడతాడు. అవతార పరి సమాప్తం అవుతున్న సమయంలో ఆ కుర్రవాణ్ణి శివకేశవులు ఒంటరిగా ఆ అడవిలో విడిచి పెడుతూ, ఇతర జంతుజాలంతో ఇతనికి ఎటువంటి ఆపదా కలుగకుండా రక్షగా మెడలో ఒక మణిని వేసి ఇద్దరు తమ లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడితో ఆ ఇతిహాసం పూర్తవుతుంది. అయితే ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు వేటకు రాగా ఆ అడవిలో హరిహరులకు పుట్టిన కుర్రవాడు ఒంటరిగా దొరకుతాడు. పిల్లలు లేని ఆ మహారాజు ఆ కుర్రవాణ్ణి దైవప్రసాదంగా భావించి తన రాణి చేతిలో ఉంచి, మణిసహితంగా దొరికిన కారణంచేత మణికంఠుడు అనే నామకరణం చేస్తారు. యుక్తవయసు వచ్చిన మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలన్న తలంపుతో అతనిని సంప్రదించగా, అందుకు మణికంఠుడు తాను ధర్మసంస్థాపనకోసమే పుట్టిన కారణంచేత, తన తరువాత ఆ రాజదంపతులకు కలిగిన సంతానానికే పట్టాభిషేకం చేయమని, తాను బ్రహ్మచారిగా అడవికి పోయి తన అవతార కార్యక్రమాన్ని నిర్వహిస్తాననీ చెప్పి, రాజ్యత్యాగం చేసి శబరిగిరిని చేరతాడు.అక్కడి నుంచి హరిహర సుతుడుగా, అయ్యప్పగా, ధర్మశాస్తగా పిలవబడుతూ, అవతార విశేషం పూర్తి అవ్వగానే అదే శబరిగిరి మీద వెలిసి ఇప్పుడు అందరి పూజలూ, సేవలూ అందు కుంటున్నాడు.



విజయనగరం పట్టణం లో వివిధ ఏరియా లో నెలకొన్న విద్యుత్ సమస్య లపై జిల్లా సూపరిండెంట్ ఇంజినీర్ విష్ణుకివినతిపత్రాన్ని ఇస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని. బీజేపీ నాయకులు ముని, రామకృష్ణ, మండల అధ్యక్షుడు కొండల శ్రీనివాసరావు, హరనాథ్, రాజేష్, బూర జగ్గారావు, గీతా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 443 మద్యం బాటిళ్లు, 27,400 నగదు పట్టివేత



భీమునిపట్నం : ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం ను తెచ్చి బెల్టు షాప్ ల ద్వారా అమ్ముతున్న మద్యం రాకెట్ ను గాజువాక ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకొని వారి వద్ద నుండి 443 బాటిళ్లు రూ. 27400 నగదు, ఒక ఇన్నోవా కారు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు చిట్టివలస సప్తగిరి థియేటర్ వద్ద అను మానము గా ఇన్నోవా కారు ఉండడం, ఆ కారును తనిఖీ చేయగా వెనుక భాగములో కార్టూన్లతో మందు బాటిళ్లు ఉన్నట్లు కనుగొన్నారు. అందులో వున్న వారిని విచారణ చేయగా వారి నుండి సరైన సమాధానం రాలేదని తెలిపారు. కాగా కారులో ఉన్న జొందలి కొత్తయ్య తాత, లక్ష్మణ, సి హెచ్ నరసింహులు, కొయ్య రామారావులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జె.వెంకటరావు సుభాష్ రోడ్డు లో వున్న ఇంటివద్ద తనిఖీ చేయగా ఆ ఇంట్లో 203 బాటిళ్ల మద్యం దొరికిందని గాజువాక ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బి. జయ రామిరెడ్డి ఏఈఎస్ఆర్. ప్రసాద్, ఎస్ఓ రాజా రావు తెలిపారు. ఆ నలుగురిని ఆరెస్ట్ చేసి నట్లు చెప్పారు.

## కోవిడ్ బారిన పడిన
# వీడియో జర్నలిస్టులకు ఆర్థిక చేయూత

50 లక్షల ఇన్సూరెన్స్ కోసం ప్రధాన మంత్రికి మరోసారి లేఖ



విశాఖపట్నం : రాష్ట్రంలో కోవిడ్ బారినపడిన జర్నలిస్టులను తక్షణమే ఆదుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి మోదీ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిలకు తమ జాతీయ సంఘం తరుపున లేఖ సమర్పించనున్నట్టు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. ఈ మేరకు కోవిడ్ బారినపడి కోలుకున్న పలువురు వీడియో జర్నలిస్టులకు గురువారం డాబాగార్డెన్స్ కార్యాలయంలో తన సొంత నిధులు 30 వేల రూపాయిలు అందచేశారు. ఈ సందర్భంగా గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ జర్నలిస్టులను ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా గుర్తించి కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. ఈ విషయమై గతంలో తమ అసోసియేషన్ తరుపున ప్రధాని ముఖ్యమంత్రులకు లేఖ రాయడం జరిగిందన్నారు. తాజాగా మరోసారి లేఖ రాస్తామని చెప్పారు. కోవిడ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు తాను సొంతంగా సుమారు ఏడు లక్షల రూపాయిలతో జర్నలిస్టులు ఇతర సంస్థలకు దశల వారీగా నిత్యవసర వస్తువులు అందచేయడం జరిగిందన్నారు. దీనితో పాటు కోవిడ్ బారినపడిన జర్నలిస్టులు వీడియో జర్నలిస్టులకు మరో 2.60 లక్షలు తన సొంత నిధులను వారికి అర్థికంగా చేయూత నిచ్చుందేకు అందించానన్నారు. కేవలం మానవతా దృక్పథంతో నే తాను సొంతంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్టు చెప్పారు.

ఎటువంటి స్వార్థం లేకుండా జర్న లిస్టులు సంక్షమమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు శ్రీనుబాబు చెప్పారు.

ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికి ఇటువంటి విపత్తులో జర్నలిస్టులను ఎంతో కొంత తన వంతుగా ఆదుకోవాలని భావించి ఈ తరహా సేవలు దశల వారీగా కొనసాగిస్తున్నట్టు చెప్పారు.

# దిష్టిబమ్మలు దగ్ధంపై న్యాయం చేయలేదు

## కొయ్యూరు మండల బీజేపీ అధ్యక్షులు అప్పలరాజు



మురుకుర్తి అప్పలరాజు

కొయ్యూరు : తన దిష్టి బమ్మను దగ్ధం చేసిన వైసిపి కార్యకర్తలపై పోలీసుల ద్వారా ఇంత వరకు న్యాయం జరగలేదని కొయ్యూరు మండల బిజెపి అధ్యక్షులు మురుకుర్తి అప్పలరాజు అన్నారు. గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. తప్పు చేసిన వాళ్ల సంఖ్యను చూస్తే వీడియోలలో చూసిన ఆధారంగా ఎక్కువగా ఉందన్నారు. కానీ పోలీసులు కేవలం ముగ్గురిని మాత్రమే తీసుకురావడం జరిగిందన్నారు. వినాయకచవితి పండుగను బహిరంగ ప్రదేశాల్లో గుమికూడి చేసుకోవద్దని చెప్పిన పోలీసులు, కోవిడ్-19 నిబంధనలను ఈ విషయంలో ఉల్లంఘించిన నిందితుల విషయంలో మాత్రం పట్టించుకోకపోవడం చాలా భాదాకరమన్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులే ఉదాసీనతగా వ్యవహరిస్తే నిందితులు ఇంకా ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుంటారన్నారు. మాకు ఇచ్చిన రసీదు ప్రకారం చింతపల్లి కోర్టుకి వెళ్లాలా..? లేక హైకోర్టుకు వెళ్లాలా అనేది తెలియని సందిగ్ధత మాలో ఉందన్నారు. పార్టీ రాష్ట్ర శాఖ, జిల్లా శాఖ న్యాయ విభాగంతో సంప్రదించి వారి సలహా మేరకు ఒకటి రెండు రోజు లలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులైన నర్సీపట్నం ఏఎస్పీని కలిసి ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. మా నాయకులు లోకులగాంధీ విశాఖపట్నం ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారన్నారు. ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ కూడా ఎస్పీని కలిసి తగు చేయాలని లేఖ రాశారన్నారు.

# వేచలంలో మరో మూడు కరోనా పాజిటివ్



దేవరాపల్లి : మండలంలోని వేచలం పిహెచ్‌సి పరిధిలో మరో మూడు కరోనా పాజిటివ్ కేసులు నిర్ధారణ అయినట్లు స్థానిక వైద్యాధికారిణి బి. హరిక తెలిపారు. బుధ వారం మామిడిపల్లి గ్రామానికి చెందిన 34 ఏళ్ళు యువకుడికి పాజిటివ్ రాగా, గురువారం పిహెచ్‌సి లో 30 టెస్టు లు నిర్వహించడం జరిగిందన్నారు. అందులో రెండు పాజిటివ్ కేసులు వచ్చా యన్నారు. చిననంది పల్లి గ్రామానికి చెందిన 34 ఏళ్ళు యువకుడికి, వేచలం గ్రామానికి చెందిన 45 ఏళ్ల మహిళకు పాజిటివ్ నిర్ధారణ రావడంతో కేంద్రానికి తరలించామన్నారు.

## పెద్దాపురం స్టేషన్‌లో
# 3200 లీటర్ల పులిసిన బెల్లపు ఊట ధ్వంసం

మూడు(3)కేసులు నమోదు



పెద్దాపురం : పెద్దాపురం ఎస్ఇబి స్టేషన్ పరిధిలో పెద్దాపురం స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో టీమ్‌లు జగ్గంపేట మండల పరిధిలో దాడులు నిర్వహించి గొల్లలగుంట, కాండ్రేగుల గ్రామాల పరిధిలో సారాయి కాపునకు నిల్వ ఉంచిన 3200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను మూడు వేర్వేరు ప్రదేశాల్లో కనుగొని ధ్వంసం చేసి మూడు కేసులు నమోదు చేయడమైనది.

ఈ దాడుల్లో...

పెద్దాపురం ఎస్ఇబి ఎంఆర్‌కె.దాస్, ఎస్ఐలు, కె.విజయకుమార్. కె.తాతారెడ్డి, ఎస్ఐ తదితర సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

## సత్యదేవుడ్ని దర్శించిన మాజీ మంత్రి, రాష్ట్ర శాసనసభ పక్ష ఉపనాయకుడు కింజరపు అచ్చెంనాయుడు



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివార్ని మాజీ మంత్రి,రాష్ట్ర శాసనసభ పక్ష ఉపనాయకుడు కింజరపు.అచ్చెంనాయుడు దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకముగా స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఆయనను స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు రాజాల చిట్టిబాబు, సరమర్ల మధుబాబు, రాయి శ్రీనివాస్, బండారు సురేష్, రాజాల శాస్త్రి, నాయుడు తదితరులు కలిశారు.

# ములకలాపల్లి పిఏసిఎస్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జేడీ



దేవరాపల్లి : మండలంలోని ములకలాపల్లి వ్యవసాయ సహకార పరపతి కేంద్రం గోడౌన్ ను గురువారం జిల్లా వ్యవసాయ శాఖ జెడి. జి.ఎస్ ఎన్ ఎస్ లీలావతి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. స్థానిక వ్యవసాయ శాఖాధికారి వీ వీ సృజన, ఇంచార్జ్ ఎంఏఓ ను కలిసి మాట్లాడారు. మండలంలో ఎరువులు ఎంత వచ్చింది, ఎంత అమ్మారు, ఎంత నిల్వ ఉంది అని క్షుణ్ణంగా రికార్డులు పరిశీలన చేశారు.

ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. మండ లంలో ఇంత వరకు 671.2టన్నులు యురియా వచ్చిందన్నారు.

అందులో కలిగొట్ల సొసైటీ లో 25, ములకలపల్లి సొసైటీ లో 25 టన్నులు నిల్వ ఉందన్నారు. వీటిని రైతులకు సకాలంలో సరఫరా చేయాలని ఆదేశించారు. ఆమె వెంట ములకలాపల్లి సొసైటీ అధ్యక్షులు రొంగలి శంకరరావు తదితరులు ఉన్నారు.

## సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు
# పోడు పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం నాయకులు దీసరి గంగరాజు



అనంతగిరి : పోడు సాగు పట్టాలకోసం ధరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకు పట్టా ఇవ్వాలని సీపీఎం పార్టీ మాజీ ఎంపిటిసి సబ్యడు డి, గంగరాజు, మండల కార్యదర్శి కిల్లో మొస్య డిమాండ్ చేశారు, గురువారం గిరిజన సంఘం కార్యాలయంలో పత్రికా సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 24 పంచాయతీల లో గిరిజన రైతులు పోడు పట్టాలు గురించి పలు మార్లు దరఖాస్తు చేసుకున్నప్పటకీ అధికారులు గుర్తించి పట్టాలు మంజూరు చేయడంలో మండల రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని 3200 మంది రైతులు దరఖాస్తు చేయగా 2500 మంది కి గుర్తించి మిగత 800 మందికి రిజక్ట్ చేయడం దారుణం అని అలాగే భీంపోలు పంచాయతీ పరిది లో ఎగువ లువ్వ, లువ్వ రాళ్లగెడ్డ కొత్తూరు పంచాయతీ పరిదిలో పుటచింత, గుమ్మ పంచాయతీ, కల్యాణ్ గుమ్మి, గ్రామల రైతులకు గుర్తించ లేదని ఆయన అన్నారు గిరిజనులు సాగుచేసుకుంటున్న పోడు భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

# ఉచిత పశువైద్య శిబిరం

గొలుగొండ : గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామంలో పశుసంవర్ధకశాఖ రిలయన్స్ పౌండేషన్ వారి సహకారంతో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశువులకు, వివిధ వ్యాధులకు ట్రీట్‌మెంట్ చేయడం జరిగింది. ముఖ్యంగా ప్రస్తుతం ఎల్ఎస్‌డి ఎక్కువగా ఉన్నందున వారికి ట్రీట్‌మెంట్, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరిగింది. చిన్న పెయ్యలకు, దూడలకు నట్టల మందు ఇవ్వడం జరిగింది. చూడి పశువులకు పరీక్షలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమలో నర్సీపట్నం అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్.గణేష్, కేడీపేట వెటర్నరీ డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్, కొత్తమల్లంపేట, చోద్యం పశువైద్య సహాయకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పశువులకు చికిత్స చేస్తున్న దృశ్యం

## అడ్డగోలుగా పదోన్నతి పొందిన
# శ్రీహరిరాజు పై ఈఓ వేటు

సింహాచలం: సింహాచలం దేవాలయంలో మరో సంచలన నిర్ణయం తీసుకున్న ఆర్.జే. సి. భ్రమరాంభ.గతంలో అడ్డగోలుగా పదోన్నతి పొందిన డి.వి.యెస్.రామరాజు. లేని పోస్టు ఏ.ఈ.మెకానిక్ పోస్ట్ సృష్టించి పదోన్నతి పొందిన శ్రీహరి రాజు రామచంద్ర మోహన్ హయాంలో పదోన్నతి పొందిన రాజు. ప్రస్తుతం కనకమహాలక్ష్మి దేవ స్థానంలో ఏ.ఈ.విధులు నిర్వహిస్తూ.. రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల సమాఖ్య అధ్యక్షుడుగా కొనసాగుతున్న డి.వి.యెస్. రాజు. ప్రస్తుతం డి.వి.యెస్.రాజును డి.గ్రేడ్ ఏఈ నుంచి ఫిట్టర్ గా చేస్తూ ఉత్తర్వులు జారీచేసి ఉత్తర్వుల ను ప్రస్తుతం హరి రాజు పనిచేస్తున్న కనకమహాలక్ష్మి ఈఓకు పంపించిన భ్రమరాంబ.

## కరోనాను నివారించాలని
## గజపతినగరం ముత్యమాంబ ఆలయంలో పూజలు



గజపతినగరం ముత్యమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చోడవరం : రోజురోజుకు విస్తరిస్తున్న కరోనా మహ మ్మారిని నివారించాలని కోరుతూ మండలంలోని గజపతినగరం ముత్యమాంబ అమ్మవారి ఆల యంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమ, ధూప దీప నైవేద్యాలను సమర్పించి గ్రామంలో కరోనా రాకుండా నివారించాలంటే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్ల శ్రీనివాసరావు, జుత్తాడ సోమేశ్వర రావు, శిలపరశెట్టి నాయుడు, శిలపర శెట్టి శ్రీను, పాలమర శెట్టి సురేష్, ఆళ్ల రామకృష్ణ, రాపేటి శ్రీనివాసరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.వి.జగన్మోహన్ మరణానంతరం
## ఆయన దేహం ఆంధ్రా మెడికల్ కాలేజికి తరలింపు



విశాఖపట్నం : పెద్ద వాల్తేర్ ఏరియా ఈస్ట్ పాయింట్ కాలనీ వాసి ఎన్.వి.జగన్మోహన్, కోరమండల్ మాజీ చీఫ్ ఇంజినీర్ మరణానంతరం ఆయన దేహాన్ని ఆంధ్రా మెడికల్ కాలేజ కి ఇవ్వాలి అని ముందుగానే వీలునామా రాశారు. గురువారం 7.30కి అతని ఇంట్లోనే కన్నుమూశారు. ఈ విషయం వారి భార్య ద్వారా మిత్రులందరికీ తెలిసింది. కుమారుడు యుఎస్ఏలో ఉన్నారు. అతని స్నేహితుడు కుమారుడు ప్రసాద్ కోరమండల్ ఉద్యోగి అతని అంతిమ వీడ్కోలు కోసం సాయి పూజా ఫౌండేషన్ ఛైర్మన్, మాజీ కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ కి సమాచారం ఇచ్చారు. దానికి రవికుమార్ స్పందించి దేహానికి కోవిడ్ పరీక్షలు చేయించి ఆంధ్రా మెడికల్ కాలేజ అనాటమీ విభాగానికి అతని పార్థివ దేహాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, మురళీ, అతని స్నేహితులు అంతిమ వీడ్కోలు పలికారు.

# పవన్ అభిమానులు మొక్కలు పంపిణీ



దేవరాపల్లి : జనసేన పార్టీ అధినేత, ప్రముఖ సినీ నటుడు పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని మండలంలో కాశీపురం, వాకపల్లి గ్రామాల్లో ఆయన అభిమానులు గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

కాశీపురం లో చిటిమిరెడ్డి వీరునాయుడు, అక్కునాయుడు గ్రామస్తులకు 1000 మొక్కలను పంపిణీ చేశారు. వాకపల్లి గ్రామంలో గుమ్మడి శ్రీరామ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ రమ్మీ ఆటల యాప్ లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిషేధించాలి

**- సీఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం**




విశాఖపట్నం : దేశంలో యువతను అన్ని విధాలా పెడదోవ పట్టిస్తున్న పబ్ జీ యాప్ తో పాటు 118 విదేశీ యాప్ లను నిషేధిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం హర్షం వ్యక్తం చేశారు,కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్ఫూర్తిగా తీసుకొని రాష్ట్రంలోను ఆన్లైన్ రమ్మీ ఆటల యాప్ లతో పాటు ఫ్రీ ఫైర్, బ్లూవేల్ తో పాటు మరికొన్ని పిల్లల జీవితాలను,మానసిక స్థితిగతులను, ఉన్నతులు, మధ్య తరగతి, పేద వర్గాల అనే తారతమ్యం లేకుండా ఆర్థిక మూలాలను దెబ్బతీస్తు,కుటుంబ వ్యవస్థలను తారు మారు చేస్తున్న ప్రాణాంతక ఆటలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నిషేదించేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) విశాఖ జిల్లా సైకాలజీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.జగ్గారావు నేతృత్వంలో గురువారం విశాఖ నగరంలోని నక్కవాని పాలెం, వివేకానంద కళ్యాణ మండపంలో ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం మాట్లాడుతూ,.రాష్ట్రం వ్యాప్తంగా ఇటీవల కరోనా పేరుతో పిల్లలకు జరుగుతున్న ఆన్లైన్ తరగతులును సాకుగా చూపి తెలిసీ,తెలియని వయసు వల్ల అధిక శాతం బాలలు, విద్యార్థులు ఈ రమ్మీ యాప్ లతో పాటు మరిన్ని ఆకర్షణీయమైన మైండ్ గేమ్ లకు దాసోహం అవుతుండడం, నిలువెల్లా మునిగిపోతుండడం,కొన్ని సందర్భాల్లో మానసిక స్థైర్యం కోల్పోయి ఆత్మహత్యలకు పూను కొంటున్న సందర్భాలు లెక్కకు మించి ఆధారాలు తమ ఫోరం వద్ద ఉన్నాయని అన్నారు.తక్షణమే రాష్ట్ర వ్యాప్తంగా ఈ యాప్ లను నిషేదించాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి,స్పీకర్,హోం శాఖ మంత్రులకు లేఖలను పంపించామని అన్నారు,తమ లేఖకు స్పందించి బాలల ప్రేమికులైన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం యాప్ ల నిషేధంపై త్వరలోనే సానుకూల నిర్ణయం వెలువరిస్తుందన్న ఆశాభావంతో ఉన్నామన్నారు, బాలల జీవితాలును దెబ్బ తీస్తున్న ఈ ఆటల యాప్ లు నిషేధంపై రాష్ట్ర ప్రభుత్వం అనుకూల నిర్ణయం వెలువడే వరకు తాము బాలలు,వారి తల్లిదండ్రుల పక్షాన నిలవనున్నామని అన్నారు. సీఆర్పీఎఫ్ సైకాలజీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వ్యక్తిత్వ వికాస నిపుణుడు,సైకాలజిస్ట్ ఎన్. సీతారామ కృష్ణారావు మాట్లాడుతూ పిల్లలకు కరోనా సమయంలో ఆన్లైన్ తరగతులను తాము వ్యతిరేకించడం లేదు గానీ,తల్లి దండ్రులు, పిల్లల భవిష్యత్ దృష్ట్యా వారి వెన్నంటి మొత్తం క్లాస్ అయినంతవరకు డేగ కళ్ళతో చూడాల్సిన పూర్తి బాధ్యత వారిపై ఉందన్నారు. రమ్మీ ఆటల వల్ల మానసికంగా, ఆర్థికంగా ఎలా చిదికి పోతున్నారో ఆధారాలతో త్వరలోనే ఎలక్ట్రానిక్ సాధనాలు,ఇతర ప్రచార సాధనాల ద్వారా సమాజాన్ని,పిల్లలను జాగృతి పరిచేందుకు ప్రణాళికతో కూడిన కార్యక్రమాల రూపకల్పనలో అడుగులు వేస్తామన్నారు. ఫోరం సైకాలజీ జిల్లా విభాగం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ సైకాలజిస్ట్ ,డాక్టర్ కే.జగ్గారావు మాట్లాడుతూ ఈ రమ్మీ యాప్ లపై దృష్టి ని నిలిపి ఈ ఆటల పైనే దృష్టిని పూర్తిగా కేంద్రీకృతం చేస్తున్న పిల్లల తల్లిదండ్రుల బ్యాంక్ అకౌంట్లలో లక్షలాది రూపాయల ఖాళీ అవుతూ పేద,మధ్య తరగతి పిల్లల కుటుంబాల్లో ఆర్థిక గొడవలకు, కారణమవుతూ కుటుంబ సభ్యుల మధ్య మనస్తత్వాలు చిన్నాభిన్నం అవు తున్నాయని వాపోయారు. ఈ ఆటల అకృత్యాలు పై ఎవరికి ఫిర్యాదులు చేయాలో అర్థం కాని దీన స్థితిలో ఉన్నారని అన్నారు. ఫోరం, సైకాలజీ విభాగం జిల్లా జిల్లా కార్యదర్శి, సైకాల జిస్ట్,డాక్టర్ ఎం.కల్యాణి మాట్లాడుతూ ఈ ఆన్‌లైన్ రమ్మీ ఆటలు ప్రారంభమైన మొదటి నుండి నేటికీ ఎన్నో పిల్లల కేసులుని తీవ్రంగా పరికించి చూస్తే తల్లిదండ్రుల గారాభం, పిల్లలు తదేకంగా సెల్ ఫోన్ లను చూస్తూ ఉన్నట్టయితే అసలు పట్టించుకోకుండా ఉండడం,ప్రధాన కారణాలుగా తెలుసుకుంటున్నా మని అన్నారు. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శకుంతల, నగర మహిళా కో.కన్వీనర్ జి.సత్యవతి, నగర ప్రధాన కార్యదర్శి పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వం రైతులకు

## విద్యుత్ కష్టాలు తగ్గించేందుకు బదిలీ అనేది మోసం

**మాజీ ఉపముఖ్యమంత్రి మరియు పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప**

పెద్దాపురం : ఈ ప్రభుత్వం ఏకంగా ఉచిత విద్యుత్ పథకాన్ని నీరుకార్చే నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో జగన్మోహన్ రెడ్డి గారి రైతు వ్యతిరేక విధానాల వలన రైతు ఆత్మహత్యలు పెరిగాయి. రైతు ఆత్మహత్యల్లో మన రాష్ట్రం భారత దేశంలో మూడో స్థానంలో ఉంది. 2019 లో ఆంధ్రప్రదేశ్ లో 1,029 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన రుణ మాఫీని వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడం వలన రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరి గాయి. ఈ ప్రభుత్వం రైతులకు విత్తనాలు, ఎరువులు ఇవ్వడం లేదు. రైతులను నష్టాల్లో ముంచి - అప్పుల ఊబిలో నెట్టారు. ఈ ప్రభు త్వం ధాన్యం బకాయిలు రూ. 300 కోట్లు ఇవ్వకుండా రైతులను బాధిస్తున్నారు - వేలాది ఎకరాల అసైన్డ్ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకొన్నారు. ఇకనైనా రైతు సంక్షేమ విధానాలు తీసుకువచ్చి రైతుకు వెన్నుదన్నుగా నిలవాలి. స్వర్గీయ ఎన్.టి.ఆర్ ప్రవేశ పెట్టిన హార్స్ పవర్ విధానాన్ని కొనసాగించి కొత్త మీటర్లు వేసే విధానాన్ని ఆపివేయాలి. తద్వారా చిన్న, సన్నకారు, కౌలు రైతులను కాపాడవలసిందిగా ఈ ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

# కరోనా రోగులను ఆదరిద్దాం

## ఆదరించి చేయూతనిద్దాం

**కరోనా రోగులకు పళ్ళు ఫలహారం పంచిపెట్టిన రాష్ట్ర యువజన కార్యదర్శి చెట్టి వినయ్**



అరకులోయ : విశాఖ మన్యంలో గల గిరిజన గ్రామాల్లో కరోనా మహమ్మారి బారిలో పడి పాడేరు వైటీసీలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి యువనేత రాష్ట్ర యువజన కార్యదర్శి చెట్టి.వినయ్ స్వయానా పిపిటీ కిట్స్ ధరించి వెళ్లి రోగులకు మానసిక ధైర్యం నిచ్చి తన మాటలతో వారి గుండెల్లో మనో ధైర్యం నింపి, ఎప్పటికైనా మనమందారం ఈ లోకంలో శాశ్వతం కాదు బ్రతికినెళ్లు ధైర్యంగా బ్రతకాలని, ఎన్నటికైన ఈ లోకం విడిచి పెట్టాల్సిందేనని, అందుకే బ్రతికినంత కాలం నవ్వుతూ హాయిగా ఎంత కష్టం వచ్చినా నష్టం వచ్చిన వాటిని మరచిపోయి జీవించడం కోసం ఆలోచించాలని, కరోనా రోగులకు గుండె ధైర్యం నింపి తొందరగా కోలుకోవాలని స్వయానా వైటిసిలో ప్రతి ఒక్క రోగి దగ్గరకు వెళ్లి పాలు, పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు.

సందర్భంగా కరోన రోగులు చెట్టి.వినయ్‌ని ఆశీర్వదించారు. అలాగే కొంతమంది అభినంది కృతజ్ఞతలు చెప్పారు.

## కరోనా ఆంక్షల కారణంగా... జీవనోపాధి కోల్పోయిన.. 20 నిరుపేద కుటుంబాలకు..

# బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు అందజేసిన.. వివేకానంద సంస్థ

**ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హనుమంతరావు, సంస్థ సీనియర్ సభ్యుడు అల్లుమల్లు సోంబాబు సహకారంతో...**



విశాఖపట్నం : దక్షిణ నియోజకవర్గం, 39 వ వార్డు వైసిపి కార్పొరేటర్ అభ్యర్థి కొల్లి సింహాచలం చేతుల మీదుగా బియ్యం బస్తాలు, నిత్యావసర వస్తువులు.. అందజేసింది.

ఆంక్షల కారణంగా.. లైటింగ్, మైక్ సెట్టింగ్, షామియానాలు, డెకరేషన్ కార్మికుల పరిస్థితి దయనీయంగా మారిందని అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక చవితి సమయంలో కూడా వారికి జీవనోపాధి లేకుండా పోయింది.. కరోనా మహమ్మారి కారణంగా.. పనులు లేక పేద ప్రజలు కుటుంబాలతో సహా పస్తులు ఉంటున్నారని, వారిని ఆదుకోవడం కోసం.. దాతల సహకారంతో.. 164 రోజులుగా అలుపెరగకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. మరికొంత మంది దాతలు ముందుకు వస్తే మరికొంత మంది పేదల ఆకలి తీర్చేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## చాకిపల్లి లో ఘనంగా

**పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు**




చోడవరం : మండలంలోని చాకిపల్లి గ్రామంలో జనసేన నేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.

స్థానిక జనసేన యూత్ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వ హించి, అనంతరం నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువత పాల్గొన్నారు.

# వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్లు వద్దు

**మీటర్లు బిగిస్తే పగులగొట్టండి : సీపీఎం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు**




కడప : రాష్ట్ర ప్రభుత్వం రైతుల వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించాలనే నిర్ణయాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు అన్నారు. గురువారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అనే హామీతోనే అధికారంలోకి వచ్చారన్న విషయాన్ని సీఎం జగన్ మోహన్ రెడ్డి మరువకూడదని పేర్కొన్నారు మీటర్లు బిగిస్తే పగులగొట్టాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా రైతుల జీవితాలు తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. రాయలసీమ, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు జిల్లాలో కొంత ప్రాంతంలో వ్యవసాయం అత్యధికంగా బోర్ల కిందే సాగుతుందని చెప్పారు. వ్యవసాయాన్ని దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం ఎపికి ఇచ్చే అప్పులకు, రైతాంగ జీవితాలకు ముడి పెట్టిందని తెలిపారు సిఎం విద్యుత్ సంస్కరణలకు అంగీకరించి, కేంద్రమే రాష్ట్రంలో విద్యుత్ ను నడుపుకోవచ్చు నిర్ణయానికి వచ్చారని విమర్శించారు. భవిష్యత్తులో విద్యుత్ ను రైతులకు ఉచితంగా ఇవ్వడం గానీ, ధరలు పెరగకుండా అడ్డుకోవడానికి గానీ, సబ్సిడీ ఇవ్వడానికి కాగానీ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి అధికారం ఉండదని పేర్కొన్నారు విద్యుత్ నిర్వహణ కేంద్ర ప్రభుత్వం చేతిలోకి వెళు తుందని చెప్పారు. దీనిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లు బిగించే అంశంపై రాజకీయాలకు అతీతంగా ఉద్యం సాగిద్దాం పిలుపు నిచ్చారు రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు మార్చి నుంచి ఇప్పటి వరకు కరోనా భారంగా రైతులు నష్టపోయారని చెప్పారు. ఐదు సంవత్సరాలుగా కరువుతో నష్టపోయారని తెలిపారు ఇటువంటి పరిస్థితుల్లో మీటర్లు బిగించాలనే నిర్ణయం తీసుకోవడం దుర్మార్గమన్నారు మీటర్లు బింగిచే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామమోహన్ కమిటీ సభ్యులు పాపిరెడ్డి, నగర కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మాజీమంత్రి శ్రావణ్ త్వరగా కోలుకోవాలని

## అమ్మవారి గుడిలో పూజలు



అరకులోయ : మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కరోనా పాజిటివ్ తో విశాఖపట్నం ప్రధమ ఆసుపత్రిలో వైద్యం పొందు తున్నారు. త్వరగా కోలుకోవాలని ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవమైన మోదకొండమ్మ అమ్మవారి గుడి దగ్గర తెలుగుదేశం పార్టీ నాయకులు పూజలు చేశారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ కరోనా పాజిటివ్ తో మాజీ మంత్రి కిడారి.శ్రావణ్ కుమార్ తో పాటు పాజిటివ్ తో బాధ పడుతున్నావారు అనేక మంది ఉన్నారు వారందరూ త్వరగా కోలుకోవాలని వారందరికీ మోదకొండమ్మ అమ్మవారి ఆశీస్సులు ఎల్ల ప్పుడూ ఉండాలని పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా నాయ కులు బాకూరు వెంకటరమణ పి.పాండురంగ స్వామి సత్తిబాబు శశిభూషణ్ వెంకట్రావు మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు.

## బంగారం కోసం అమ్మమ్మ ని చంపిన మనవడు



భీమునిపట్నం: పద్మనాభం మండలం బర్లపేట గ్రామంలో బంగారం కోసం అమ్మమ్మ కొంకి పాపియమ్మ (65)ను హత్య చేసిన మనవడు కంటుభుక్త శ్రీనివాస్ మృతురాలిది భీమిలి మండలం దాకమర్రి పంచాయితీ బర్లపేట మారుమూల పొదల్లో హత్యచేసి వృద్దురాలి మెడలో ఆరుతులాల బంగారంతో పరారైన నిందితుడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# డి పట్టాలు ఇచ్చి 44 సంవత్సరాలయినా పాసు పుస్తకాలు ఇవ్వడం లేదు

**జాయింట్ కలెక్టర్ కి మొరపెట్టుకున్న మాధవనగరం వైఎస్ఆర్సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటరమణ**



నర్సీపట్నం : డి పట్టా నమూనాలు పంపిణీ చేసి 44 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని వైఎస్ఆర్సిపి జిల్లా కార్యవర్గ సభ్యులు సిద్ధాబత్తుల వెంకటరమణ జాయింట్ కలెక్టర్ ఎం వేణుగోపాలరెడ్డి తో మాట్లాడి ఫిర్యాదు చేశారు. స్థానిక శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ గణేష్ సుమారు 240 మంది కి రావలసిన రైతు భరోసా పై చేసిన సిఫార్సులను ఆయనకు అందించారు. 16 రోజుల క్రితం స్థానిక సబ్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య కు ఇచ్చిన దరఖాస్తును కూడా జతపరిచారు. ఆన్లైన్లో భూములు నమోదు చేయకపోవడం వలన, పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వకపోవడం వల్ల, ప్రభుత్వం నుండి వచ్చే ఏ రకమైన సబ్సిడీలు పొందలేకపోతున్నాం అని కనీసం విత్తనాలు... రైతు భరోసా... బ్యాంకు రుణాలకు దూరమవుతున్నామని జేసీ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులు 126 మంది కి పట్టాదారు పాసు పుస్తకాలు ఏకపక్షంగా రాజకీయ నేపథ్యంలో పంపిణీ చేశారన్నారు. రాజకీయ కక్షలతో మిగతా రెండు వందల నలభై మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని ఆవేదన చెందారు. వీరంతా తమ సొంత భూములను ప్రజాప్రయోజనార్థమై తాండవ ప్రాజెక్టు నిర్మాణానికి 1971 - 73 సంవత్సరాల మధ్యలో ప్రభుత్వానికి ఇచ్చారు. ప్రత్యామ్నాయంగా వీరందరికీ 1976లో ప్రతి కుటుంబానికి ఒక ఎకరం చొప్పున పంపిణీ చేసి డి పట్టా నమూనాలను అందించారు. నాటి నుండి నేటి వరకు రాజకీయ పలుకుబడి ఉంటే తప్ప పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వడం లేదని బహిరంగంగా తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు, పాలకులు కలిపి కేవలం 126 మంది గతంలో పంపిణీ చేయడం పట్ల పూర్తి విచారణ చేస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్థానిక సబ్ కలెక్టర్ కు సిఫార్సు చేస్తానని ఆయన తెలిపారు.

# సమస్యలపై ఎంపీ మాధవికి వినతి



కొయ్యూరు : అరకు ఎంపి గొడ్డేటి మాధవిని ఎల్ఐసి ఉద్యోగులు గురువారం విశాఖపట్నం లోని ఎంపి క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

ఎల్ఐసి ప్రైవేటీకరణ జరిగితే ఉద్యోగస్తులకు జరిగే నష్టాన్ని ఉద్యోగ సంఘాలు ఎంపికి వివరించారు. అదే విధంగా ఖాతాదారులకు ఎల్ఐసి ప్రైవేటీకరణ అయితే జరిగే నష్టాన్ని వివరించారు.

# జీజీహెచ్ శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

## కలెక్టరేట్ వద్ద ధర్నా




కాకినాడ : కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి శానిటేషన్ వర్కర్స్ ఆగస్టు 10న ప్రారంభించిన ఆందోళన 20వ రోజు కొనసాగింది.ముందుగా జీజీహెచ్ మాతా శిశు విభాగం నుండి జిల్లా పరిషత్ సెంటర్, ఆర్డీవో కార్యాలయం మీదుగా కలెక్టరేట్ చేరుకుని ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్ మాట్లాడుతూ గత 20 సం॥లుగా జీజీహెచ్‌లో పారిశుద్ధ్య సేవలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.600జీతం నుండి ప్రస్తుతం రూ.8వేలు అందుకుంటున్నా మన్నారు. పోరాడితేనే జీతాలు పెరిగాయన్నారు. కోవిడ్ ఆసుపత్రిగా మార్చాక పని భారం పెరిగిందన్నారు.కార్మికులు చాలా మంది కోవిడ్ బారినపడి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ఏదైనా జరిగితే కార్మికులకు ఇన్సూరెన్స్ కూడా లేదన్నారు అధికారులు, నాయకులు స్పందించి న్యాయం చేయాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు.యూనియన్ నాయకుడు వివిఎన్ కుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ 16 వేల వేతనంను జీఓగా ప్రకటించి ఈ సంవత్సరం జనవరి నుంచి అమలు చేస్తున్నట్లు సచివాలయ పుస్తకం లో రాసారన్నారు.

ఆ జీఓ అయినా అమలు చేయాలని, కోవిడ్ నేపథ్యంలో కార్మికులకు తగిన రక్షణ పరికరాలు ఇవ్వాలని, పీఎఫ్.ఈ.ఎస్.ఐ. కాకినాడలోనే చెల్లించాలని, ప్రతి నెలా 5వలోపు జీతాలు చెల్లించాలని కోరుతున్నా మన్నారు. అనంతరం కలెక్టరేట్లో వినతి పత్రం సమర్పించారు.ఈ కార్య క్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ, నగర అధ్యక్షుడు పలివెల వీరబాబులతో పాటు యూనియన్ నాయకులు ఆర్.రమేష్, జె.శేషు, తలుపులమ్మ, పుష్ప, సుబ్బలక్ష్మి, విజయ, భాగ్యవతి, రవి, ఖాన్, కుమార్, భాగ్యరాజు, నాగేశ్వరరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పితాని సేవలు ఆదర్శనీయం

## పండూరు...పి.వెంకటాపురంలలో హోమియో మందులు పంపిణీ



కాకినాడ రూరల్ : పాత్రికేయ వృత్తిలో ఉండి ప్రజలకు సేవా చేస్తున్న ఎర్రబాట ఎడిటర్ పితాని రాము సేవలు మరొకరికి ఆదర్శంగా నిలుస్తాయని పండూర్ వైఎస్సార్ సీపీ నాయకులు వలవల వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. గురువారం ఎర్ర బాట ఎడిటర్ పితాని రాము మండలంలో వెంకటాపురం, పండూరు గ్రామంలో ఉన్న సుమారు 2వేల కుటుంబాలకు హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పండూరు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యదర్శి లక్ష్మి అధ్యక్షత వహించగా వలవల వెంకటేశ్వరరావుతో పాటు మరికొందరు వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.ముందుగా కార్యదర్శి లక్ష్మి హోమియో మందులను ఏవిధంగా వాడాలో వాలంటీర్లకు వివరించారు. అనంతరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పితాని రాము తన పత్రిక ద్వారా సమాజానికి మేలైన సమాచారం అందించడమే చేయడమే కాకుండా మండలంలో ఉన్న చాలా గ్రామాల ప్రజలకు వ్యాధి నిరోధక శక్తి పెంచే హోమియో మందులను పంపిణీ చేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా పితాని చేస్తున్న సేవలను మరొకరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అదేవిధంగా కరోనా మహమ్మారి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు.మిగతా దేశాలతో పోలిస్తే మన దేశంలో కరోనా వ్యాప్తి అదుపులో ఉందన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండా లన్నారు. పితాని అందించిన హోమియో మందులను వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ఎలా వాడాలో చెప్పి పంపిణీ చేయాలన్నారు. ప్రతీ రోజూ రాత్రీ భోజనం చేసిన తర్వాత ఒకక్కరు ఒక్కో మాత్ర వేసుకోవాలని అన్నారు.

మూడు రోజుల పాటు మందులు వాడలన్నారు. 2 ఏళ్ల లోపు వారు, గర్భిణీ స్త్రీలు, హృద్రోగులు ఈ మందులు వాదరాదన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నంది పాటి వెంకట శ్రీనివాస్, నంది పాటి ధర్మరాజు, నంది పాటి రాంబాబు, శ్రీను రాజబాబు,అన్నవరపు చెళ్ళారావు, తుమ్మలపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ చిన్ని కృష్ణ చేతుల మీదుగా ఆయూష్ మందులు పంపిణీ

కాకినాడ : కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందికి ఆయుష్ -19 ఆయుర్వేద మందులును కాకినాడ ఆర్డీవో చిన్ని కృష్ణకు, రెవెన్యూ సిబ్బందికి ఎర్రబాట ఎడిటర్ పితాని రాము అందజేశారు. ఈ సందర్భంగా పితాని రాము పాత్రికేయులతో మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందికి ఆర్డీఓ చేతుల చిన్ని కృష్ణ చేతుల మీదుగా ఆయుష్ -19 ఆయుర్వేద మందులును అందించడం జరిగిందని కాకినాడ అర్బన్ తహాశీల్దారు కార్యలయంలోని సిబ్బందికి కూడా అందించడం జరిగిందని ప్రతి ఒక్క ఉద్యోగి భౌతిక దూరం పాటిస్తూ, మాస్కు తప్పని సరిగా ధరించాలని తద్వారా మన కుటుంబాన్ని కాపాడు కుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయాలి

## ఆటో యూనియన్ నాయకుడు విజయ భాసర్

రాయచోటి : రాయచోటి ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలనిఆటో కార్మిక నాయకుడు ఆటో యూనియన్ అధ్యక్షుడు విజయ భాస్కర్ అన్నారు. రాయచోటిని జిల్లా చేయాలనీ మన ఎంపీ మిథున్ రెడ్డి , ఛీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి సీఎం జగన్మోహన్ రెడ దృష్టికి తీసుకెళ్ళారని అన్నారు.ప్రస్తుతం రాయచోటి మున్సిపాలిటీ గ్రేడ్1 గా ఉందని . రాయచోటిని జిల్లా చేస్తేరాజంపేట సహ కోడూరు, తంబల్లపల్లె, పుంగనూరు, పీలేరు, మదనపల్లె పట్టణాలు కలుస్తాయని చెప్పారు. రాయచోటి నియోజకవర్గములో వెలిగల్లు, రోళ్ల మడుగు ప్రాజెక్టులతో పాటు గండికోట ప్రాజెక్టు నుంచీ కూడా మన ఛీఫ్ విప్ శ్రీ కాంత్ రెడ్డి నీటి పథకాలను రాయచోటిని సస్యశ్యామలం చేశారని అన్నారు. మరియు దగ్గర్లోనే శ్రీనివాసపురం రిజర్వాయర్ నీటితో రాయచోటి నియోజకవర్గ ము మొత్తం జలకళ లాడుతోందని అన్నారు. కర్నూలు, బెంగుళూరుహైవే సెంటర్లో ఉండడంతో వ్యాపార, వాణిజ్య పరంగా, రాకపోకలకు అన్నీ పట్టణాలకు ముఖ్య కేంద్రంగా ఉంటుందన్నారు.తమిళనాడు, కర్ణాటక రాష్ట్రానికి చాలా దగ్గరగా ఉన్న ప్రాంతమని అన్నారు. రాయచోటి నీ చూస్తే స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి గారికి ఎంత ఇస్తామంటే మన మిథున్ రెడ్డి కూడా అలాంటి అభిమానమన్నారు . రాజంపేట నియోజకవర్గ ము లోని సుండుపల్లి, వీరబల్లి మండలాల ప్రజలు95 శాతం మంది రాయచోటి కోరుకుంటున్నారని తెలిపారు . రాయచోటిని జిల్లా చేస్తే ఎటు చూసినా రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అన్నీ నియోజకవర్గ లకు 75,కి,మీ పరిధిలోపల ఉందని తెలిపారు. ఇంకో10లక్షల జనాభా విస్తీరుణం పెరిగిన కూడా ఎలాంటి ఇబ్బందులకు తావు లేదన్నారు. రాయచోటిలో నీరు, డికెటి భూములు కూడా పుష్కలంగా ఉన్నాయని ఆయన అన్నారు. మన నియోజకవర్గము పార్లమెంట్ పరిధిలో దాదాపు20 మండలాలకు చాలా దగ్గరగా ఉండి ఉన్నతమైన ప్రాంతమని చెప్పారు. మన ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో రాయచోటిని జిల్లాగా ప్రకటిస్తే ఇంకా చాలా అభివృద్ధి జరుగుతుందని అన్నారు.తంబల్లపల్లె, పీలేరు, నియోజవర్గాల ప్రజలు కూడా రాయచోటి కావాలనీ కోరుకుంటున్నారని అన్నారు. కావున మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు రాయచోటిని జిల్లా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘనాయకులు రంగారెడ్డి, బహుజన టీచర్స్ అసోసియేషన్ హరిబాబు, సురేష్ కుమార్ రెడ్డి, సాంబశివ,యువ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

# భద్రతామండలిలో మరోసారి పాకిస్తాన్ కుట్ర విఫలం



న్యూయార్క్ : ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్‌పై పాకిస్తాన్ చేసిన మరో చర్య విఫలమైంది. ఇద్దరు భారతీయులను ఉగ్రవాదులుగా ప్రకటిస్తూ పాకిస్తాన్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. దాన్ని భద్రతా మండలి తిరస్కరించింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి టీఎస్ తిరుమూర్తి ట్వీట్టర్ ద్వారా ఈ సమాచారం వెల్లడించారు. ఈ ఏడాది పాకిస్తాన్ ఇలా వ్యవహరించడం ఇది రెండోసారి. రెండు సార్లు ఇద్దరు భారతీయులను ఉగ్రవాదులుగా ప్రకటించాలని ఐరాసపై ఒత్తిడి తేవడానికి ప్రయత్నించి ఘోరంగా విఫలమయ్యారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి యొక్క కమిటీ.. దీనిని 1267 కమిటీ అని పిలుస్తారు. ఇది ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడే ఏ దేశ పౌరులను నిషేధిత జాబితాలో ఉంచుతుంది. ఇద్దరు భారతీయులు అంగారా అప్పాజీ, గోవింద పట్నాయక్‌లను ఉగ్రవాదులుగా ప్రకటించాలని పాకిస్తాన్ తీర్మానాన్ని ఐరాస ముందుకు తీసుకువచ్చింది. ఈ ఏడాది మొత్తం నలుగురు భారతీయులను ఉగ్రవాదులుగా ప్రకటించడానికి పాక్ కుట్ర చేసింది. భద్రతా మండలిలో యూఎస్, బ్రిటన్, జర్మనీ, బెల్జియం దేశాలు పాకిస్తాన్ ప్రతిపాదనను తిరస్కరించాయి. 1267 కమిటీని పాకిస్తాన్ తన రాజకీయాల కోసం ఉపయోగించాలనుకుంటుందని, దానికి మతపరమైన రంగు ఇవ్వాలనుకుంటున్నారని ఐక్యరాజ్య సమితిలో భారత శాశ్వత ప్రతినిధి తిరుమూర్తి ఆరోపించారు.

### వరుసగా రెండోసారి విఫలం

ఈ ఏడాది వరుసగా రెండోసారి భారతీయ పౌరులను ఉగ్రవాదులుగా ప్రకటించడానికి పాకిస్తాన్ విశేషంగా ప్రయత్నించడం విశేషం. రెండుసార్లూ పాకిస్తాన్ విఫలమైంది. జనవరి నెలలో ఇద్దరు భారతీయ పౌరులు అజోయ్ మిస్త్రీ, వేణు మాధవ్ డోంగ్రా కార్యకలాపాలను అనుమానాస్పదంగా ప్రకటించాలని ప్రతిపాదించింది. వాస్తవానికి, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు జైష్-ఎ-మొహమ్మద్‌కు వ్యతిరేకంగా మౌలానా మసూద్ అజార్‌పై భారత్ బలమైన సాక్ష్యాలను సమర్పించింది. భారతదేశంలో ఉగ్ర దాడులు చేసే కుట్రలో తాను పాల్గొన్నానని నిరూపించింది. అజార్ యొక్క సంబంధాలు అల్ ఖైదా, తాలిబాన్లతో కూడా ఉన్నాయని ఆధారాలను నమోదుచేసింది. తదనంతరం, భద్రతా మండలి జైష్ కింగ్‌పిన్‌ను గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించింది. పాకిస్తాన్ ఇప్పుడు భారతదేశంపై ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రయత్నిస్తూ భంగపడుతున్నది.

# వైసీపీ నాయకుడు వెంపాడ వెంకటరమణ రెడ్డి జన్మదిన వేడుకలు



భీమునిపట్నం : జీవీఎంసీ భీమిలీ జోన్ 1వ వార్డ్ మరియు 2వ వార్డులో వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు వెంపాడ.వెంకటరమణ రెడ్డి 45వ జన్మదిన వేడుకలు వైసీపీ కార్పొరేటర్ అభ్యర్థి మరియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా పుష్పగుచెం ఇచ్చి సాలువలతో సన్మాన చేసి కేక్ కట్ చేసి అందరి కి పంపిణీ చేశారు. వైసీపీ నాయకులు .అక్కరమాని. రాము నాయుడు మాట్లాడుతూ వెంపాడ. వెంకటరమణ నిరంతరం పార్టీ కోసం అహర్నిశలు శ్రమించే వ్యక్తి అని కొనియా డారు. ఈ కార్యక్రమంలో పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గుపల్లి.ప్రసాద్,పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు.వెంకట్ రెడ్డి,మాజీ కౌన్సిలర్ లు ఉప్పాడ.నాగేశ్వరరావు,కొప్పల. రమేష్, జీ.వి రమణ,యూత్ అధ్యక్షుడు బింగి.హరి కిరణ్ రెడ్డి,మహిళ అధ్యక్షురాలు జీరు.సుజాత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిరి. విజయకుమార్, సీనియర్ నాయకులు అక్కరమాని. చిన్నబాబు, కొప్పుల. కృష్ణ జీరు. శ్రీనివాస్ రెడ్డి, దుంప.సాయి ,రొక్కం.శ్రీను,తదితరులు పాల్గొన్నారు

# ఈసారి బీసీసీఐ అధికారికి కరోనా

## నిర్వహణా బృందానికి విస్తృతంగా పరీక్షలు




దుబాయ్: ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ నిర్వహణ అంత సులభమేమీ కాదని అనిపిస్తోంది. అందరూ బయో బుడగ ఛత్రంలోనే ఉంటున్నా ఏదో ఒక విధంగా కరోనా వైరస్ కాటేస్తోంది. ఇప్పటికే చెన్నై సూపర్‌కింగ్స్ బృందంలో ఇద్దరు ఆటగాళ్లు సహా మొత్తం 13 మంది దానికి బాధితులు అయ్యారు. యూఏఈలో ఐపీఎల్ నిర్వహణ కోసం వచ్చిన బీసీసీఐ అధికారి ఒకరు తాజాగా కొవిడ్-19 బారిన పడ్డారని తెలిసింది. 'బీసీసీఐ బృందంలో ఒకరికి పాజిటివ్. అతడు క్రికెట్ నిర్వహణ బృందం లేదా వైద్య బృందానికి చెందిన వ్యక్తా అన్నది చెప్పలేను. కానీ పరీక్షలు మాత్రం జరుగుతున్నాయి. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, లక్షణాలు లేకుండా కనిపిస్తున్నారు. అంత ఆందోళన పడాల్సిందేమీ లేదు' అని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. దుబాయ్, అబుదాబిలో బస చేస్తున్న ఐపీఎల్ ఫ్రాంచైజీలు బయో బుడగలో ఉన్నాయి. అయినప్పటికీ చెన్నై బృందంలో పేసర్ దీపక్ చాహర్, యువ బ్యాట్స్‌మన్ రుతురాజ్ గైక్వాడ్‌కు కరోనా సోకింది. ఇక అధికారులు, సామాజిక మాధ్యమ బృందాల్లో కొందరికి పాజిటివ్ వచ్చింది. దీంతో ఆ జట్టంతా 14 రోజుల క్వారంటైన్‌లో ఉన్నారు. పొట్టి క్రికెట్ వేడుకను కవర్ చేసేందుకు వెళ్లే స్టార్ బృందంలోనూ ఒకరికి వైరస్ సోకడంతో ప్రయాణం నిలిపివేసిన సంగతి తెలిసిందే. కరోనా భయంతో సురేశ్ రైనా, లసిత్ మలింగ వంటి క్రికెటర్లు టోర్నీ నుంచి తప్పుకుంటున్నారు.

హర్భజన్ సింగ్ దుబాయ్‌లో సీఎస్‌కేతో కలవాల్సి ఉన్నా ఇప్పటివరకు అతడి ప్రయాణంపై సమాచారం లేదు. సెప్టెంబర్ 19 నుంచి నవంబర్ 10 వరకు లీగ్ జరగనుంది.

# కోవాక్స్ వ్యాక్సిన్ గ్రూపులో 76 సంపన్న దేశాలు



న్యూఢిల్లీ : సంస్థ నేతృత్వంలో కోవాక్స్ ప్రాజెక్టును చేపట్టారు. కోవాక్స్ టీకాను సొంతం చేసుకునేందుకు సుమారు 76 దేశాలు ఒక్కటయ్యాయి. వ్యాక్సిన్‌ను అభివృద్ధి చేసి.. అందరికీ అందే విధంగా ఆయా దేశాలు పర్యవేక్షించనున్నాయి. ఈ ప్రాజెక్టుకు గావి వ్యాక్సిన్ గ్రూపు నాయకత్వం వహిస్తున్నది. గావి వ్యాక్సిన్ అలియన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సేత్ బెర్క్లీ మీడియాతో ఈ అంశం గురించి మాట్లాడారు. కోవాక్స్ ప్రాజెక్టులో జపాన్, జర్మనీ, నార్వే లాంటి సంపన్న దేశాలు జతకూడినట్లు చెప్పారు. కోవాక్స్ వ్యాక్సిన్‌ను ప్రొక్యూర్ చేసుకునేందుకు ఆయా దేశాలన్నీ ఒప్పందంపై సంతకం చేశాయన్నారు. చైనా కూడా తమ గ్రూపులో కలుస్తుందేమో అన్న సందేహాలను ఆయన వ్యక్తం చేశారు. జీఏవీఐ, డబ్ల్యూహెచ్‌వో, సీఈపీఐలు సంయుక్తంగా కోవాక్స్ టీకాను అభివృద్ధి చేస్తున్నాయి. అయితే ప్రభుత్వాలు అక్రమంగా ఈ టీకాలను నిల్వ చేయకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కువగా వైరస్ ప్రభావానికి గురయ్యే వారికి ముందుగా ఆ వ్యాక్సిన్ ఇవ్వాలన్న నియమాన్ని విధించారు. కోవాక్స్ కోసం ధనిక దేశాలు ఫైనాన్స్ చేయనున్నాయి. ఆ దేశాలన్నీ సుమారు 92 పేద దేశాలకు వ్యాక్సిన్ సమానంగా అందే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు బెర్క్లీ చెప్పారు. కోవాక్స్ ప్రాజెక్టులో చేరడం లేదని అమెరికా స్పష్టం చేసింది. కోవాక్స్ వద్ద వ్యాక్సిన్ కొనేందుకు ఆసక్తిగా ఉన్నట్లు యురోపియన్ యూనియన్ పేర్కొన్నది. కోవాక్స్ ప్రాజెక్టును వెలకట్టలేని బీమా పాలసీ అని డబ్ల్యూహెచ్‌వో పేర్కొన్నది. సురక్షితమైన, ప్రభావంతమైన కోవిడ్19 వ్యాక్సిన్‌ను అన్ని దేశాలు పొందవచ్చు అని తెలిపింది. ప్రాజెక్టులో చేరాలనుకునే దేశాలకు సెప్టెంబర్ 18వ తేదీ వరకు గడువు ఇచ్చారు. 2021 చివరి నాటికి సుమారు రెండు మిలియన్ల కోవాక్స్ డోసులను సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం వ్యాక్సిన్ క్లినికల్ ట్రయల్స్ దశలో ఉన్నదని, ఈ ఏడాది చివరి కల్లా పూర్తి డేటా లభిస్తుందని బెర్క్లీ చెప్పారు.



మంత్రివర్గ సమావేశం అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి
వైయస్ జగన్‌మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి సియం జగన్ ఆశీస్సులు పొందిన
రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు కుమారుడు
అవంతి విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ ముత్తంశెట్టి వెంకట శివ సందీష్ (నందాబాబు)

## కాళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి



భూపాలపల్లి : కాళేశ్వరం, లక్ష్మీ బరాజ్‌కు గోదావరి నదీ ప్రవాహం గురువారం తగ్గుముఖం పట్టింది. గురువారం ఉదయం 61,9000 క్యూసెక్కులు ఉన్న ప్రవాహం సాయంత్రానికి 49,6,300 క్యూసెక్కులకు చేరింది. అలాగే అన్నారం(సరస్వతి) బరాజ్‌కు మానేరు, గోదావరి నది నుంచి 8,600 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తుండగా రెండు గేట్లు ఎత్తి 8,600 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

బరాజ్‌లో ప్రస్తుతం 08.77 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు తెలిపారు. లక్ష్మీ బరాజ్‌లో 3.460 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఇంజినీరు అధికారులు వెల్లడించారు. ఎగువ నుంచి 4,96,300 ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 75 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదలడంతో 4,96,300 ఔట్‌ఫ్లో వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు.

### భారత్-రష్యా మధ్య ఏకే -47 203

# రైఫిల్స్ తయారీ ఒప్పందం

మాస్కో : భారతదేశంలో ఏకే -47 203 రైఫిల్స్ తయారీకి ఇరు దేశాల మధ్య ఒప్పందం ఖరారైంది. ఈ విషయాన్ని రష్యా అధికారిక మీడియా గురువారం వెల్లడించింది. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తుతం రష్యాలో పర్యటిస్తున్నారు. ఏకే -47 203 అనేది ఏకే-47 రైఫిల్ యొక్క సరికొత్త వెర్షన్. ఇది ఇండియన్ స్మాల్ ఆర్మ్స్ సిస్టమ్ (ఇన్సాస్) 5.56 45 మిమీ అటాక్ రైఫిల్ స్థానంలో ఉంటుంది. భారత సైన్యానికి సుమారు 7,70,000 ఏకే -47 203 రైఫిల్స్ అవసరం.

వీటిలో 1,00,000 దిగుమతి అవుతుండగా.. మిగిలినవి భారతదేశంలో తయారు చేయనున్నారు అని రష్యా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న స్పుత్నిక్ వార్తా సంస్థ తెలిపింది. ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ బోర్డ్ (ఓఎఫ్బీ), కలాష్నికోవ్ కన్సర్న్, సైనిక ఎగుమతుల కోసం రష్యా స్టేట్ ఏజెన్సీ అయిన రోసోబొరోనెక్స్పోర్ట్ మధ్య స్థాపించబడిన జాయింట్ వెంచర్ ఇండో-రష్యా రైఫిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఆర్ఆర్పీఎల్) లో భాగంగా ఈ రైఫిల్స్ భారతదేశంలో తయారవుతాయి. ఐఆర్ఆర్పీఎల్‌లో ఓఎఫ్బీ మెజారిటీ వాటాను 50.5 శాతం కలిగి ఉండగా.. కలాష్నికోవ్ గ్రూప్‌కు 42 శాతం వాటా ఉంటుంది. రష్యా ప్రభుత్వ యాజమాన్యంలోని ఎగుమతి ఏజెన్సీ రోసోబోరోనెక్స్పోర్ట్ మిగిలిన 7.5 శాతం వాటాను కలిగి ఉంటుందని నివేదిక తెలిపింది.

7.62 ఐ 39 మిమీ రష్యన్ ఆయుధాన్ని ఉత్తర ప్రదేశ్‌లోని కొర్వా ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేయనున్నట్లు గత ఏడాది ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, ఉత్పాదక యూనిట్ ఏర్పాటు ఖర్చు సహా ఒక్కో రైఫిల్ ధర సుమారు 1,100 డాలర్లుగా ఉంటుందని అంచనా. 1996 నుంచి వాడుతున్న ఇన్సాస్, హిమాలయాల్లో అధిక ఎత్తులో జామింగ్, మ్యాగజైన్ క్రాకింగ్ వంటి కొన్ని సమస్యలను అభివృద్ధి చేసిందని స్పుత్నిక్ నివేదిక తెలిపింది.

## సియస్ఆర్ బ్లాక్‌ను పరశీలించిన జిల్లా కలెక్టర్ వి.వినయ్‌చంద్



విశాఖపట్నం : కె.జి.హెచ్.లో సి.యస్.ఆర్. బ్లాక్ కోవిడ్-19 పేషెంట్లకు రెండు మూడు రోజుల్లో అందుబాటులోకి రానున్నదని జిల్లా కలెక్టర్ వి. వినయ్ చంద్ వెల్లడించారు. కె.జి.హెచ్. లో కొత్తగా నిర్మించిన సి.యస్.ఆర్. బ్లాక్ ను గురువారం ఆయన సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. బ్లాక్ అంతటినీ క్షుణ్ణంగా పరిశీలించారు. 150 ఐ.సి.యు. పడకలతో, ఆక్సిజన్ ఉన్న 500 పడకలతో రెండు మూడు రోజుల్లో కోవిడ్-19 పేషెంట్లకు అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. మూడు ఆపరేషన్ థియేటర్లు, ఆ బ్లాక్ లోనే ఒక ల్యాబ్, పేషెంట్ల అటెండెంట్లకు పేషెంట్ల సమాచారం తెలియజేసేందుకు ఒక సమాచార కేంద్రం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ రూంలోను సి.సి. కెమెరా ఉంటుందని, దీనిని మోనిటరింగ్ చేయడానికి ఒక రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కల్పించిన సౌకర్యాలు ఎంత ముఖ్యమో సర్వీసు కూడా అంతే ముఖ్యమని వైద్యులను ఆదేశించారు. కె.జి.హెచ్. ఒక చారిత్రాత్మకత గల ఆసుపత్రి అని, కె.జి.హెచ్. రాష్ట్రంలో నంబర్ ఒన్ లో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మరియు కె.జి.హెచ్ పర్యవేక్షకులు డా. పి.వి. సుధాకర్, ఎపిఎంఐడిసి ఇఇ ఉమేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# వెస్ట్ ఇన్‌ఛార్జి ఏసీపీగా రజని



కంచరపాలెం : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వెస్ట్ సబ్ డివిజన్ ఇన్ చార్జిగా అడ్మిన్ ఏడీసీపీ రజనిని నియమించారు. ఇక్కడి వెస్ట్ ఏసీపీగా వ్యవహరించిన స్వరూపరాణి అమరావతిలోని పోలీస్ శాఖ ముఖ్య కార్యాలయానికి బదిలీపై వెళ్లిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఏసీపీగా సీసీఎస్ ఏసీపీ శ్రావణ్ కుమార్‌ను వేశారు. ఇదే సమయంలో సుజాతనగర్‌లో దళిత యువకుడి శిరోముండనం సంఘటన వెలుగు చూసింది. ఇదిలా ఉంటే తన వ్యక్తిగత కారణాల నేపథ్యంలో శ్రావణ్ కుమార్ సెలపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఇక్కడి అడ్మిన్ ఏడీసీపీ రజనిని వేశారు. నగర పోలీస్ శాఖ పరిధిలోని కోవిడ్ బాధితులకు కొన్నాళ్లగా రజని సేవలందిస్తున్నారు. పాలనా పరమైన అంశాలు చూస్తూనే ఇప్పుడు వెస్ట్ సబ్ డివిజన్ కు ఇన్ చార్జిగా అధికారిగా ఆమె వ్యవహరించనున్నారు.

### మహిళ ఉద్యోగులను వేధిస్తున్న వారిపై

# కఠిన చర్యలు



విజయవాడ : బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో జరిగిన దారుణాలను ఖండిస్తున్నామని ఏపీ మహిళ కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ అన్నారు. ఆడవారిపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే, మహిళా ఉద్యోగులకు అన్యాయం జరిగితే ఉపేక్షించమని హెచ్చరించారు. డిపార్ట్‌మెంట్‌లో వివక్షత ప్రస్తావన లేవనెత్తడం హేయమైన చర్య అన్నారు. మహిళల పట్ల ప్రతి ఒక్కరు గౌరవం కలిగి ఉండాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు మహిళ కమిషన్ దృష్టికి వచ్చాయని, వాటిపై చర్యలు చేపడతామని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని విభాగాల్లోని మహిళ ఉద్యోగులను వేధిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీసీ వెల్ఫేర్ హాస్టల్స్‌లో వార్డెన్‌లు సైతం కొంత మంది వేధిస్తున్నారని తమ దృష్టికి వచ్చినట్లు వాసిరెడ్డి పద్మ అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు రక్షణ కల్పించాలని సంకల్పించారని, మహిళ భద్రతపై రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని విభాగాల్లోని మహిళ ఉద్యోగులతో చర్చించామని తెలిపారు. ఈ రోజు ముప్పై మంది మహిళా అధికారులు విచారించారని, మహిళ కమిషన్‌కు ప్రతి రోజు అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మహిళ రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. స్పెషల్ కోర్టులను ఏర్పాటు చేసిందన్నారు. నేరస్థులకు ఇరవై ఒక రోజులో శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టామన్నారు. రాష్ట్రంలో మహిళ ఉద్యోగుల భద్రతకు జగన్ ప్రభుత్వం ఏళ్ల వేళలా సిద్ధంగా ఉంటుందన్నారు.

### ఏటికొప్పాక కొండపల్లి బొమ్మల తయారీ పరిశ్రమ పార్క్ కోసం

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పి.వి.ఎన్ మాధవ్ లేఖ





విశాఖపట్నం : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇచ్చినపిలుపు మేరకు, ఆత్మ నిర్భర్ భారత్ సాధన కొరకు మరియు వోకల్ ఫర్ లోకల్ కాన్సెప్ట్ లో భాగంగా, మన దేశంలో సాంప్రదాయ బొమ్మల తయారీ కుటుంబాల అభ్యున్నతి మరియు ప్రోత్సాహానికి బలమైన విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని, దేశీ టాయ్ తయారీ క్లస్టర్స్ మరియు భారతీయ పౌరాణిక భావనలతో కాన్సెప్ట్ , థీమ్ తో కూడిన వీడియో గేమ్‌లను ప్రోగ్రామింగ్ చేసే కంపెనీలకు ప్రారంభించడానికి, ప్రోత్సాహం అందించాలని అందుకు విశాఖపట్నం జిల్లా ఏటికొప్పాక అనువైన ప్రదేశం అని ప్రతిపాదిస్తూ, వాటి తయారీ పరిశ్రమ కోసం జాతీయ విధానం, రాష్ట్ర విధానాన్ని రూపొందించాలని కోరుతూ ఉత్తరాంధ్ర ఎమ్.ఎల్.సి పి.వి.ఎన్ మాధవ్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్రాసిన లేఖలలో విన్నవించడం జరిగింది.

విశాఖపట్నం జిల్లాకు మంచి కనెక్టివిటీ ఉందని, అందువల్ల బొమ్మల తయారీ పార్కును స్థాపించడం గురించి మనం పరిశీలించాలని, ఈ టాయ్ మాన్యుఫాక్చరింగ్ పార్క్ ద్వారా కొత్తగా ఉపాధి కల్పన తద్వార ప్రజలకు, ప్రభుత్వానికి ఆదాయం కూడ సమకూరు తుందని తెలియ జేసారు.

కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియన్ ట్రేడర్స్ ప్రకారం భారతీయ బొమ్మల పరిశ్రమ యొక్క వార్షిక టర్నోవర్ 25,000 కోట్లుగా ఉందని, ఇందులో 65% చైనా బొమ్మల పరిశ్రమ స్వాధీనం చేసుకుందని, భారతదేశంలో బొమ్మల పరిశ్రమ గురించి లోతుగా అధ్యయనం చేయడానికి మరియు దేశీయ బొమ్మల పరిశ్రమకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం ఇవ్వడానికి మనకు జాతీయ విధానం మరియు నిపుణుల కమిటీతో కూడిన రాజ్యాంగ వ్యవస్థల సహకారం అవసరమని గుర్తు చేసారు.

ఈ విషయమై కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల గౌరవ మంత్రి,నితిన్ జైరామ్ గడ్కరీ గారికి, సహాయ మంత్రి ప్రతాప్ చంద్ర సారంగి గారికి, కేంద్ర కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ & ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ లా అండ్ జస్టిస్ శాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ గారికి, సహాయ మంత్రి సంజయ్ ధోత్రే గారికి, ఆంధ్ర రాష్ట్ర పరిశ్రమల, వాణిజ్య, సమాచార సాంకేతిక మంత్రి, మేకపాటి గౌతమ్‌రెడ్డి గారికి విడివిడిగా లేఖ రూపంలో విన్నవించడం జరిగింది.

## డిసెంబర్ నుండి 840 వాహనాల్లో ఇంటింటికి రేషన్ పంపించే ప్రక్రియ

### నర్సీపట్నంలో రేషన్ షాపు తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ ఎమ్.వేణుగోపాల్ రెడ్డి



నర్సీపట్నం : డిసెంబర్ నెల నుండి విశాఖ జిల్లాలో లో 840 వాహనాల్లో ఇంటింటికి రేషన్ సరుకులు పంపించే ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి విలేకరులకు వెల్లడించారు దీనికి సంబంధించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించడం జరిగిందన్నారు. సాధ్యమైనంత డిసెంబర్ నెలలో ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. నర్సీపట్నం లోని ఒక రేషన్ షాప్ ను తనిఖీ చేసి లబ్ధిదారుల తో మాట్లాడారు.జిల్లాలో లక్షా అరవై ఆరు వేల టన్నుల బియ్యం ఉచితంగా పంపిణీ చేయడం జరిగిందన్నారు 11 లక్షల 77వేల రైస్ కార్డులు ఉన్నాయన్నారు. 12లక్షల 45వేలు తెలుపు రంగు రేషన్ కార్డులు ఉన్నాయన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాళీగా ఉన్న రేషన్ డీలర్ల పోస్టులు ఎప్పటికప్పుడు భర్తీ చేస్తున్నామన్నారు విశాఖ జిల్లాలో ఇప్పటికీ 11 ఉచితంగా బియ్యం తో పాటు కందిపప్పు పంపిణీ చేయడం జరిగింద న్నారు. జిల్లాలో సుమారు 600 కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేయడం జరిగిందన్నారు. వైట్ రేషన్ కార్డ్, రైస్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఉచితంగా సరుకులు పంపిణీ చేసిందన్నారు. డీలర్ల వద్ద నుండి సరుకులు తీసుకునే సమయంలో తూకం సక్రమంగా ఉందా లేదా అనే విషయమై లబ్ధిదారులు జాగరూకత వహించాలి అన్నారు. కొన్ని డిపోల్లో వస్తున్న ఫిర్యాదులపై ఆయన దృష్టికి విలేకరులు తెచ్చినప్పుడు, స్థానిక సబ్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య పర్యవేక్షణ చేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ ఎం ఎస్ శ్రీనివాస్ ఆర్ఐలు విఆర్వోలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### - పారిశ్రామిక ప్రాంత వైకాపా ఇంఛార్జ్ డిపో సత్యనారాయణ



ములగాడ: వాతావరణం మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి వైకాపా 5వార్డుల ఇంచార్జ్ దాడి (డిపో) సత్యన్నారాయణ స్థానికప్రజలకు సూచించారు. జీవీఎంసీ 61 వ వార్డు రామకృష్ణాపురం, పరిసర ప్రాంతాలలో వచ్చే సీజనల్ వ్యాధులు అయిన వైరల్ ఫీవర్, డెంగ్యూ ,మలేరియా, వ్యాధులను నివారణకు పారిశ్రామిక ప్రాంతం వైయస ఆర్సిపి ఇన్చార్జ్ దాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం మలేరియా సిబ్బంది చే దోమలకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే కారోన మహమ్మారి తో ప్రజలు అనారోగ్యంతో అల్లాడుతున్నారని, దీంతో సీజనల్ వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని అన్నారు. పశ్చిమ వైకాపా సమన్వయ కర్త మళ్ళా విజయప్రసాద్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించిన నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో. వైయస్సార్ బీమా మిత్ర కేతా లక్ష్మి స్పందన బాబు రావు తదితరులు పాల్గొన్నారు.

● VIJAYABHANU - Visakhapatnam ●
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com